



రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో పవన్.. పక్కన హరిప్రసాద్, దుర్గేష్

ముగిసిన పవన్ పర్యటన

- సమీక్ష తర్వాత మంగళగిరి పయనం
- రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే : దుర్గేష్
- రాజానగరం అసెంబ్లీ సీటు అభ్యర్థిపై రాని స్పష్టత

- 7లో



వైభవంగా అంతర్వేది రథోత్సవం

వేలాది మంది గోవింద నామస్మరణ మధ్య అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం మధ్యాహ్నం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకు వచ్చారు. రాజా వారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు పట్టింది. గోవింద, నారసింహ నామస్మరణలతో భక్తులు రథాన్ని లాగారు.. - 7లో

ఇవి అక్రమాలు కావా?







ఎన్జీటీ బృందానికి కనబడకుండా తుప్పల్లో ఎక్స్‌కవేటర్.. వారెళ్లాక రోడ్డెక్కి.. మళ్లీ రెడీ..

- ఎన్జీటీ బృందం రాకతో ఇసుక ర్యాంపుల మూత
- వారెళ్లాక మళ్లీ మొదలు
- కడియపులంక ర్యాంపులో వాస్తవ పరిస్థితులపై ఆరా
- స్వయంగా ర్యాంపులో పరిశీలన
- 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే జరిగింది



కడియపులంక ఇసుక ర్యాంపులో ఎన్జీటీ బృందంతో కలెక్టర్ మాధవీలత


రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బృందం వస్తుందనే సమాచారం అందుకున్న ఇసుక ర్యాంపుల నిర్వాహకులు మొత్తం ర్యాంపులను మంగళవారం మూసివేశారు. సోమవారం రాత్రి నుంచే మూసివేసి డ్రెడ్జింగ్ పడవలు, ఎక్స్‌కవేటర్ యంత్రాలను దాచేశారు. గాయత్రీ ర్యాంపులలోని తుమ్మచెట్ల మధ్యలోనూ, గోదావరి లంకల్లోని తుప్పల్లోనూ డెడ్జింగ్ బోట్లను, ఎక్స్‌కవేటర్లను దాచేశారు. కాతేరులో ఏటిగట్టుకు ఇవతల వరి పొలాలకు ఏటిగట్టుకు మధ్యలో యంత్రాలను దాచేశారు. అలాగే మంగళవారం డ్రెడ్జింగ్ ఆపేశారు. ర్యాంపుల్లో కేవలం ఇసుక గుట్టలు మాత్రమే ఉన్నాయి. పడవలు, యంత్రాలు, మనుషులు కూడా కనిపించలేదు. ఒకటి రెండు చోట్ల మనుషులు స్వయంగా ఇసుక తీస్తున్న బోట్లు కనిపించాయి. అంతా గప్‌చిప్. ఈ తతంగాన్ని 'ఆంధ్రజ్యోతి ముందే బయటపెట్టిన సంగతి తెలిసిందే. సాయంత్రం ఎన్జీటీ బృందం వెళ్లిపోగానే, ఇసుక పెత్తందారు ఆర్కే నుంచి డ్రెడ్జింగ్ మొదలుపెట్టేయండని, అధికారులు వెళ్లిపోయారనే సమాచారం వచ్చింది. దీంతో దాచిన డ్రెడ్జింగ్ బోట్లు, ఎక్స్‌కవేటర్ యంత్రాలు రాత్రికి బయటకు వచ్చేశాయి. ఇక్కడ అక్రమాలు జరగకపోతే ఎన్జీటీ బృందానికి భయపడవలసిన అవసరం ఏముందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రోజూ కోట్ల రూపాయల విలువైన ఇసుక అక్రమాలు జరుగుతున్నాయి. నెలకు వైసీపీ పెద్దలకే రూ.12 కోట్ల కప్పంకడుతున్నట్టు ఓ నిర్వాహకుడు బహిరంగంగానూ ర్యాంపుల్లో చెబుతుండడం గమనార్హం. స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఇతర అధికారులు ఏమనుకుంటున్నారో, ఏం చేస్తున్నారో ఎవరికీ అర్థంకావడంలేదు. ఎవరూ పట్టించుకోవడంలేదు. పెద్దలు పెట్టే ఒత్తిడికి అందరూ లొంగిపోయారు.

కడియపులంక, బుర్రిలంక ర్యాంప్‌లను పరిశీలించిన ఎన్జీటీ బృందం

కడియం, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని కడియపులంక, బుర్రిలంకలలోని ఇసుక ర్యాంపులను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) బృందం సభ్యులు పరిశీలించారు. మంగళవారం కడియపులంక, బుర్రిలంక ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలను అధ్యయనం చేసేందుకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ డైరెక్టర్ శాస్త్రవేత్త డి.సౌమ్య, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, పర్యావరణ కాలుష్య నియంత్రణ ఇంజనీర్ (కాకినాడ) బీహెచ్ఎల్ సందీప్ రెడ్డి, ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్, మైన్స్ అండ్ జియాలజీ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎన్జీటీ బృందం అధ్యయనం చేసింది. ఈ పర్యటనలో ఇరిగేషన్ హెడ్ వర్క్స్ ఈఈ ఆర్ కాశీ విశ్వేశ్వరరావు ఉన్నారు. తర్వాత కాటన్ బ్యారేజీ మరమ్మతులను కలెక్టర్ పరిశీలించారు. బొబ్బర్లంక, పిచ్చుకలంక వద్ద కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి నిమిత్తం ప్రతిపాదనలు పంపినట్టు కలెక్టర్‌కు ఇరిగేషన్ అధికారులు వివరించారు.

అప్పుల 'పాలు'

- బ్యాంకు రుణంతో ఇరికించి.. అమూల్‌కే పాలు పోయాలని హుకుం
- ఆర్థిక భరోసా అంటూ గొప్పలు
- మహిళా సాధికారత మాటున వంచన
- 'చేయూత'కు గేదెకు లింక్
- జీతం సర్కారుది.. సేవ ప్రైవేటు సంస్థకు
- 'జగనన్న పాల వెల్లువ' వెనుక బలవంతపు 'పథక' రచనా వ్యూహం



ఇదో 'అమూల్'యమైన దగా. మన దగ్గర ఉత్పత్తి అవుతున్న పాలు ఇతర రాష్ట్రానికి తరలిస్తారు. ఈ క్రమంలో.. మహిళా సాధికారత అంటూ గొప్ప గొప్ప మాటలుంటాయి. ఆర్థిక భరోసా అంటూ రుణాలిస్తారు. మహిళలను అప్పులపాలు చేస్తూ.. 'చేయూత'కు గేదెలకు లింక్ పెట్టే బృహత్తర ప్రణాళికను అమలుచేస్తారు. చివరకు జగనన్న పాల వెల్లువ పథకం పేరుతో అమూల్ పాల సంస్థ కోసం ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి మార్కెటింగ్ చేసి పాలన్నీ అప్పగిస్తుంది. తెల్లటి పాలలా ఈ పథకం పైకి స్వచ్ఛంగా కనిపిస్తున్నా తెరవెనుక జరుగుతున్న దోపిడీ తంతుపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు సంస్థకు 'అమూల్'యమైన సేవ చేస్తూ ప్రభుత్వం తరిస్తుండడంతో జగనన్న పాల వెల్లువలో పడి పాడి రైతులు విలవిల్లాడుతున్నారు. పాలకులు పగతో అమలు చేస్తున్న పన్నాగం అని సరిపెట్టుకుందామన్నా.. ఆ పన్నాగంలోకి పాడి రైతులను బలవంతంగా లాగుతున్నారు. పాలవెల్లువ పథకంలో భాగంగా చేయూత లబ్ధిదారులకు గేదెలకు లింక్ పెట్టి పాలను అమూల్‌కి దాసోహం చేసి మహిళలను ప్రభుత్వం అప్పులపాలు చేస్తోంది. అమూల్ కోసం 'పథకం' కచ్చితంగా పారించాల్సిందేనంటూ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. మరోవైపు ప్రజాధనాన్ని అమూల్‌యమైన సేవకు వెచ్చించి తరిస్తోంది. దానిలో భాగంగా జిల్లాలో గోపాలపురం మండలం చిట్యాలలో మరో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ని రెండు మూడు రోజుల్లో ప్రారంభించనుంది. ఇలా 'కష్టం రైతుది.. సుఖం అమూల్‌ది.. పన్నాగం ప్రభుత్వానిది.. పగ జగన్‌ది' అన్న చందంగా మారడంతో పాలవెల్లువ మొుల్లుమంటోంది. జగన్ టార్గెట్‌లో భాగంగా ఓ ప్రైవేటు డెయిరీపై పగ సాధించడానికి అమూల్‌ని తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ డెయిరీ అయిన 'విజయ'నూ తొక్కేశారు. ఇలా 2021 డిసెంబరు నుంచి పాడి రైతులు వరం మాటున చిక్కుల్లో పడ్డారు. అమూల్ (ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్)కి పాలు దోచిపెట్టడం మొదలైంది. 2022 జూలైలో అది రాష్ట్రమంతా పాకింది. ఒక్కో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌కి రూ.18 లక్షల చొప్పున జనం సొమ్ము ఖర్చుచేశారు. అయితే 2023 జూన్‌కి 60 శాతం పాల సేకరణ కేంద్రాలు పడుకున్నాయి. ఇతర డెయిరీలు పాలుపోసే రైతులకు సకాలంలో చెల్లింపులు జరుపుతూ బోనస్ కూడా ఇవ్వడంతో వాటికే పాలుపోయడానికి రైతులు మొగ్గు చూపారు. దీంతో అమూల్‌కి పాలపోత పెంచేలా ప్రభుత్వం పన్నాగానికి తెరతీసింది. చేయూత లబ్ధిదారులకు పాలవెల్లువకు లింక్ పెట్టింది. ఇష్టం ఉన్నా లేకున్నా బ్యాంకులో రుణం తీసుకొని గేదెను కొని పాలు పితికి అమూల్‌కి పోయాల్సిందే. దీని కోసం ప్రభుత్వ శాఖలను రంగంలోకి దింపింది. నయానో భయానో అమూల్‌కి లబ్ధి చేకూర్చాలని ఆదేశించింది.

● ఇదో రకం వంచన

తమ ఉత్పత్తులను గిట్టుబాటు వచ్చేచోట/వారికి అమ్ముకునే హక్కు ప్రతి రైతుకూ ఉంటుంది. జగన్ ఆ హక్కునూ హరించేసి తన పంతం కోసం మహిళా రైతులను పణంగా పెట్టారు. పశుసంవర్థక, సహకార, డీఆర్‌డీఏ శాఖలను రంగంలోకి దింపారు. చేయూత ద్వారా లబ్ధిపొందుతున్న మహిళా రైతుల వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించి వారిని గేదెలు కొనుక్కొనేలా ఒత్తిడి చేస్తున్నారు. చేయూత ద్వారా వచ్చే డబ్బులకు మరికొంత బ్యాంకు ద్వారా అప్పు చేయించి గేదెను కొనుక్కొనేలా చేస్తున్నారు. అలా చేయకపోతే ఇప్పటికే ఉన్న పింఛను, రైతు భరోసా వంటి ఉపకారాలను రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారు. కచ్చితంగా అమూల్ కేంద్రాలకే పాలను పోయాలనే షరతు విధిస్తున్నారు.

● సర్కారీ సేవ.. ఉచితంగా..

మూడు శాఖల్లోని క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచీ అధికారుల వరకూ ప్రభుత్వ హుకుంతో అమూల్‌కి పాలపోత పెంచే పనిలో మునిగిపోయారు. వారి విధులను పక్కన పెట్టి చేయూత లబ్ధిదారులను 'పథకం'లో చేర్చడంలో బిజీ అయిపోయారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న శాఖలు.. ప్రజల సేవలను వదిలేసి అమూల్ సేవలో తరలిస్తున్నారు. దీనికోసం ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్ మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ (ఏపీడీడీసీఎఫ్)ని ధారాదత్తం చేసింది. ఇప్పటికే పాడి ఉన్న రైతులకు పూచీకత్తు లేకుండా రూ.30వేల వరకూ పెట్టుబడికి, పాడి ఉన్నా లేకున్నా పాడి పశువుల కొనుగోలుకు రూ.1.60 లక్షల రుణం ఇప్పిస్తున్నారు. వాయిదాలు రైతులే చెల్లించుకోవాలి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చేతులెత్తేయగా, వివిధ బ్యాంకుల తలవొంచి అప్పులు మంజూరు చేయిస్తున్నారు. రుణం పొందినవాళ్లు అమూల్‌కే పాలు అమ్మాలి. ఇదీ షరతు. ఇక జిల్లాలోని పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ, కో-ఆపరేటివ్ శాఖల్లోని సుమారు 500 మంది ప్రభుత్వోద్యోగులు అమూల్ సంస్థ కోసం పనిచేస్తున్నారు. అమూల్‌కి సంబంధించి జిల్లాకో కో-ఆర్డినేటర్ మాత్రమే ఉండడం గమనార్హం. ఆ కంపెనీ పనులన్నిటికీ ప్రభుత్వోద్యోగులనే వాడేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే రోజుకు 400 గ్రామాల నుంచి సరాసరి 5,500 లీటర్ల పాలను అమూల్‌కి పోయిస్తున్నారు. రోజూ పోసే రైతులు 560 మంది ఉండగా.. వారంలో రెండు మూడు నాగాలు ఉండేవారు 2,300 మంది ఉన్నారు. వీళ్లను ఇప్పటికే రుణాలతో బిగించేశారు. వలంటీర్ల సహాయంతో హౌస్‌హోల్డ్ డేటా ద్వారా 7,490 మంది పాడి ఉన్న/లేని మహిళా రైతులు చేయూత ద్వారా లబ్ధి పొందుతున్నారని గుర్తించారు. ఇప్పుడు వాళ్లందరికీ రుణాలు ఇప్పించి పాలవెల్లువ పథకంలో చేర్చి అమూల్‌కే పాలుపోసేట్లు చేయాలంటూ అధికారులపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తోంది.

● మోసపూరిత పథకాల్లో ఇదొకటి..

ఒకవైపు పాడి రైతులను ప్రభుత్వం అలా దగా చేస్తోంటే.. ఇటు అమూల్ సిబ్బంది కూడా 'మేమేం' తక్కువ పితుకుతామా? అన్న చందంగా తయారయ్యారు. ప్రతి గ్రామంలో అమూల్ పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలో ఆరు బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లున్నాయి. అక్కడి నుంచి ఆటోమ్యాటిక్ మిల్క్ కూలింగ్ యూనిట్లకు పాలు వెళ్తాయి. పాలను రైతులు గ్రామాల్లోని సేకరణ కేంద్రాలకు తీసుకువచ్చిన సమయంలో అక్కడి అమూల్ ఉద్యోగి పాలలోని స్వచ్ఛతను మిల్క్ అనలైజర్ పరికరం ద్వారా అంచనా వేస్తారు. పరికరాన్ని ట్యాంపరింగ్ చేయడంతో వాస్తవ స్వచ్ఛతకంటే తక్కువగా ఫలితం వస్తుంది. పాయింట్లలో తేడాలు రైతు జేబుకు చిల్లుపెడుతున్నాయి. ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం ఆధారంగా పాల స్వచ్ఛతను నిర్ధారిస్తారు. ఫ్యాట్ శాతం 5.50, 5.60, 5.70.. ఇలా 11.00 వరకూ, ఎస్ఎన్ఎఫ్ శాతం 8.70, 8.80, 8.90, 9.00 రీడింగ్‌లో ఉంటుంది. 6% ఫ్యాట్, 9% ఎస్ఎన్ఎఫ్ ఉంటే లీటరుకు రూ.45 ఇస్తారు. అదే ట్యాంపరింగ్ చేసి రీడింగ్‌లను 5.50 శాతం ఫ్యాట్, 9 శాతం ఎస్ఎన్ఎఫ్ అని చూపిస్తే లీటరుకు రూ.40.75 మాత్రమే ఇస్తారు. ఇలా కొన్ని వేలమంది రైతుల నుంచి రూ. లక్షల్లో మోసం సొమ్మును సంస్థ ఖాతాలో వేసుకుంటుందనే ఆరోపణలున్నాయి. ఆరునెలల కిందట నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామంలోని అమూల్ పాలసేకరణ కేంద్రంపై అధికారుల బృందం దాడి చేసి మిల్క్ అనలైజర్‌ని ట్యాంపరింగ్ చేయడం ద్వారా రైతులను మోసగిస్తున్నారని గుర్తించారు. కేసు నమోదు చేయడంతోపాటు రూ.5 లక్షల జరిమానా విధించారు. వెలుగు చూడనవి ఎన్నో. ఇక అమూల్ సిబ్బంది పాల స్వచ్ఛత కోసం నిర్దేశిత పరిమాణం 30 మిల్లీలీటర్ల (ఎన్ని లీటర్ల పాలకైనా) కంటే ఎక్కువగా తీసుకొని పరీక్ష అనంతరం అవి రైతుకు ఇవ్వకుండా విడిగా పెట్టుకున్న క్యాన్‌లో పోసుకుంటారు. ప్రత్యేక క్యాన్ పోసుకునే పాల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు గ్రామంలోని మహిళా డైయిరీ సహకారం సంఘానికి ఇస్తామని చెబుతున్నారు. నిర్దేశిత పరిమాణంకంటే ఎక్కువ పరిమాణంలో తీసు కోవడం రైతులను దోపిడీ చేయడమా? కాదా? అనే ప్రశ్న వస్తోంది.

● అమూల్యమైన అబద్ధాలెన్నో..

మహిళను మోసం చేయడానికి ప్రభుత్వం అబద్ధాలను వల్లెవేయిస్తోంది. గ్రామాల్లోని ఆర్థిక పరిస్థితిని ఆసరాగా తీసుకొని రూ.30 వేల నుంచి రూ.1.60 లక్షల వరకూ చేతిలో పడుతుందని మహిళా రైతులకు ఆశ కల్పిస్తున్నారు. 'చేయూత' ద్వారా వస్తున్న రూ.18 వేలు, బ్యాంకు రుణం కలిపి పశువును కొనుగోలు చేసే విషయంలో సహాయం చేస్తామని చెబుతున్నారు. బ్యాంకులకు తీసుకెళ్లి లోను దరఖాస్తులు నింపిస్తున్నారు. ఆ క్రమంలో తాము అమూల్‌కే పాలు విక్రయిస్తామనే పత్రాలపై సంతకాలు చేయిస్తున్నారని తెలుస్తోంది. దీంతో చేసేదేమీలేక అమూల్‌కే పాలు పోస్తున్నారు. ఇతర కంపెనీల నుంచి అధికంగా సొమ్ములు వచ్చే పరిస్థితి లేదు. పైగా ఉత్పత్తి అయిన పాలన్నీ అమూల్‌కే వెళ్తున్నాయో లేదో కూడా నిఘా పెట్టారు.

బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవు

- వదంతులు వ్యాప్తి చేయొద్దు : డీఏహెచ్‌వో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని.. వదంతులను నమ్మవద్దని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లాలోని ఓ ఘటన నేపథ్యంలో అపోహలను వ్యాప్తి చేస్తున్నారన్నారు. కోడిమాంసం, కోడిగుడ్లు తినడం వల్ల బర్డ్‌ఫ్లూ రాదన్నారు. ఆ వైరస్ (హెచ్5 ఎన్1) గాలి ద్వారా వ్యాప్తి చెందదన్నారు. బర్డ్‌ఫ్లూ సోకిన/చనిపోయిన వాటిని పట్టుకున్నప్పుడు ముక్కుద్వారా.. అదే చేతులను కళ్లల్లో, ముక్కులో, నోటిలో పెట్టుకున్నప్పుడు మానవ శరీరంలోకి వైరస్ ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకూ బర్డ్‌ఫ్లూ మనిషికి సోకడం వల్ల చనిపోయిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. గుడ్లు, కోడి మాంసాన్ని ఉడికించి తినడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదన్నారు. ఇప్పటికే జిల్లాలో సర్వే నిర్వహించి ముందస్తు జాగ్రత్తలో భాగంగా 38 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోడానికి సన్నద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో కోటి నలభై లక్షల వరకూ గుడ్లు పెట్టే కోళ్లు, 10 లక్షల వరకూ బ్రాయిలర్, ఇళ్ల వద్ద 7 లక్షల నాటుకోళ్ల పెంపకం ఉందన్నారు. గుడ్ల ఉత్పత్తిలో ఒకేసారి 10 శాతం తగ్గుదల కనిపించినా, పదుల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నా, ఇతర పక్షులు గుంపులుగా మృత్యువాత పడుతున్నా బర్డ్‌ఫ్లూగా అనుమానించవచ్చన్నారు. ఈ లక్షణాలు ఎవరైనా గుర్తిస్తే వెంటనే పశువైద్యాధికారులకు తెలియజేయాలని సత్యగోవింద్ కోరారు. ఇష్టానుసారం కాలువలు, చెరువులు తదితర చోట్ల పారవేయవద్దని ఆయన సూచించారు.



ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

- కడియం మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో సీఐకి వినతిపత్రం

కడియం, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడాన్ని కడియం పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరుతూ మంగళవారం కడియం పాత్రికేయులు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి తులసీధర్‌కు, అనంతరం డిప్యూటీ తహశీల్దారు జనార్థన్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కడియం పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం : ఏఐకెఎంఎస్

రాజానగరం, ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు తీవ్రంగా ఖండించారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాకినాడ జీజీహెచ్‌లో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20: రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఓ యావజ్జీవ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. గుంటూరు జిల్లా గుంటూరు అర్బన్ ఆర్.అగ్రహారంపేటకు చెందిన ఆలాపాటి సాంబశివరావ్(85) 2019లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు కావడంతో అతడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. అతడు 2021 జూలై 3వ తేదీ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అతడిని ఇటీవల రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఎస్కార్ట్ పోలీసుల సహాయంతో ఈనెల 13న కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సాంబశివరావు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలియజేశారు.



వైభవంగా రథోత్సవం



భక్తజన సంద్రంగా అంతర్వేది

గోవింద నామస్మరణతో మార్మోగిన వీధులు

రథానికి తొలిపూజ చేసిన ఆలయ చైర్మన్



రథోత్సవానికి హాజరైన కలెక్టర్, ఎస్పీ తదితరులు

అంతర్వేది, ఫిబ్రవరి 20: గోవింద నామస్మరణలతో అంతర్వేది మార్మోగింది. పురవీధులు భక్తజన సమూహంతో నిండిపోయాయి. లక్షలాది మంది ముందు కదలగా శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2.46 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. స్వామివారి సోదరి అశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ)కు చీర, సారె లాంఛనప్రాయంగా తీసుకువెళ్లారు. ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి కొబ్బరికాయలు కొట్టారు. ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై కొలువు తీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజావారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు సమయం పట్టింది. గోవింద, నరసింహ నామస్మరణలతో రథాన్ని భక్తులు లాగారు. భక్తులు రథానికి అరటి గెలలు, గుమ్మడికాయలు, వరి కంకులు కట్టారు. రథోత్సవం ప్రారంభంలో అధికార యంత్రాంగం అత్యుత్సాహం చూపించి సామాన్య భక్తులకు రథం తాడు లాగి దణ్ణం పెట్టుకునే అవకాశం కల్పించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జంగమ దేవరులు పూరించిన శంఖాల ధ్వనితో సాగర సంగమ తీర ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వడుగు శ్రీను, తిరుమాని ఆచార్యులు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, కొపనాతి కృష్ణమ్మ కుటుంబీకులు, సర్పంచ్‌లు కొండా జాన్ బాబు, పోతురాజు నరసింహారావు (కిశోర్), ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.

అక్షింతల కోసం..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం అనంతరం తలంబ్రాలు బియ్యం కోసం భక్తులు బారులు తీరారు. క్యూలైన్‌లో స్వామివారి దర్శనం కోసం వెళుతున్న భక్తులకు దర్శనం అనంతరం అక్షింతలు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలయ్యే దర్శన క్యూలైన్లలో భక్తులకు తలంబ్రాల అక్షింతలు పంపిణీ చేశారు.

భవనాలపై నిల్చుని రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



భక్తుల పుణ్యస్నానాలు

భీష్మ ఏకాదశి సందర్భంగా వేలాదిగా భక్తులు సముద్ర స్నానాలు చేసి స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్ద క్యూలైన్‌లో సుమారు 500 మీటర్ల మేర బారులు తీరారు. క్యూలైన్‌లో కొద్దిసేపు భక్తులు కిక్కిరిసి కొంత సమయం అనంతరం స్వామిని దర్శనం చేసుకుని వెళ్లారు. స్వామివారి కల్యాణం తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులకించారు. అంతర్వేదిలో బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వర స్వామితో పాటు క్షేత్ర సంరక్షకుడు శ్రీఆంజనేయ స్వామి, శ్రీవశిష్ఠ ఆశ్రమం, గుర్రాలక్కమ్మ ఆలయాల్లో వేలాదిగా భక్తులు పూజలు చేశారు.

నేటి కార్యక్రమాలు

బుధవారం సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన, రాత్రి 8 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకట సత్యనారాయణ, శ్రీహరిరావులచే నిర్మితమైన పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కమనీయం

ద్రాక్షారామ భీమేశ్వరుని దివ్య కల్యాణం



జీలకర్ర బెల్లం చూపిస్తున్న పండితులు

పట్టువస్త్రాలు సమర్పించిన

మంత్రి వేణు, కలెక్టర్ హిమాన్షు

ద్రాక్షారామ,ఫిబ్రవరి 20: ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. మాఘ శుద్ధ ఏకాదశి ఆరుద్ర నక్షత్ర యుక్త తులా లగ్నమందు పుష్పాలంకృతమైన కల్యాణ వేదికపై మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో జరిగిన భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి పరిణయాన్ని భక్తులు తన్మయత్వంతో తిలకించారు. మూలవిరాట్టు శ్రీ భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లకు, క్షేత్ర పాలకులకు శ్రీలక్ష్మీ సమేత నారాయణస్వామి, శ్రీచండికా సమేత సూరేశ్వరస్వామికి ఏకకాలంలో జరిగిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించారు. అంతకు ముందు నంది వాహనంపై నగరోత్సవం జరిగింది. అనంతరం కల్యాణ మూర్తులను అర్చకస్వాములు వేదమంత్ర పఠనం, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేదికపైకి తీసుకుని వచ్చారు.



కమనీయం.. కడు రమణీయం...

ఆలయ బ్రహ్మ దేవులపల్లి ఫణి రామకృష్ణ, వైదిక బృందం కల్యాణవేదికపై కల్యాణమూర్తులను అధిష్ఠింపజేసి కల్యాణం తంతు ప్రారంభించారు. సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ జరిపించారు. తదుపరి స్వామివార్లకు సువర్ణ యజ్ఞోపవీత ధారణ జరిగింది. రాత్రి 10.25 గంటలకు కల్యాణమూర్తులు స్వామివార్లు, అమ్మవార్ల శిరస్సున అర్చకస్వాములు జీలకర్ర బెల్లం ఉంచి కల్యాణం జరిపించారు. అనంతరం మాంగల్యధారణ జరిగింది. ఆహ్లాదంగా ముత్యాల తలంబ్రాలు కార్యక్రమం జరిగింది. పునఃపూజ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించడంతో కల్యాణ మహోత్సవం తంతు ముగిసింది. భక్తులకు ముత్యాల తలంబ్రాలు స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు..పలువురు దాతలు భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పట్టువస్త్రాల సమర్పణ

టీటీడీ సమర్పించిన పట్టు వస్త్రాలను మంత్రి చెల్లుబోయిన వేణు దంపతులు, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా పట్టు వస్త్రాలు అందించారు. స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలను సమర్పించింది. దేవదాయశాఖ ఇన్‌చార్జి ఆర్జేసీ ఎం.విజయరాజు, జిల్లా సహాయ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, దేవదాయ శాఖ తనిఖీదారు రాపాక బాలాజీరామ్‌ప్రసాద్, ఈవో పీటీవీ సత్యనారాయణ, వాడ్రేవు సుందరరత్నాకరరావు పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కంచర్ల చక్రి స్వామివారికి 504 కిలోల లడ్డూ సమర్పించారు. మంగళవారం ఉదయం భీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా జరిగింది. గణపతిపూజ, మహన్యాసం అనంతరం పంచామృతాలు, పండ్ల రసాలతో స్వామిని అభిషేకించారు. లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు.

శాస్త్రోక్తంగా వధూవరుల అలంకరణ...

ఉదయం 6.15 గంటలకు భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను వధూవరులను చేశారు. శాస్త్రోక్తంగా ముత్తయిదువులు పసుపు దంచారు. అనంతరం కల్యాణ మూర్తులకు అర్చకస్వాములు మంగళస్నానం చేయించారు. వధూవరులుగా అలంకరించారు. స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా సాయంత్రం 3.05 గంటలకు ముందుగా అంకురార్పణ, ధ్వజారోహణం జరిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని పుష్పాలంకరణతో ఆలయం శోభాయమానంగా మారింది. ఆలయం, కల్యాణవేదిక పుష్పాలంకరణ ప్రత్యేకతగా నిలిచింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ద్రాక్షారామ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ పెద్దపులి అలజడి



చెరుకుమిల్లి శివారులో జాడలను పరిశీలిస్తున్న అధికారులు

దేవరపల్లి/గోపాలపురం, ఫిబ్రవరి 20: దేవరపల్లి మండలం బందపురం గ్రామశివారు పోలవరం కాల్వగట్టు వద్ద పొగాకు తోటల్లో పులి సంచరించినట్టు అడుగులను రైతులు, గ్రామస్తులు గుర్తించారు. అటవీశాఖాధికారులకు విషయం తెలియజేయడంతో రాజమండ్రి ఫారెస్ట్ రేంజ్ ఏరియా ఆఫీసర్ ధనరాజు టీమ్ బందపురం, పోలవరం గట్టు, పొగాకు, పామాయిల్ తోటల్లో పులిజాడలను గుర్తించారు. పులి సంచరిస్తుందని తెలియడంతో గ్రామస్థులు భయందోళనలో ఉన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఏరియా ఆఫీసర్ ధనరాజు మాట్లాడుతూ పెద్దపులి ప్రస్తుతం దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పెద్దాపురం, చెరుకుమిల్లి, బంధపురం, గ్రామాల మధ్య కుడికాల్వ ప్రాంతంలో ఉందని తెలిపారు. చిట్యాల, పెద్దాపురం, భీమోలు గ్రామాల ప్రజలను అటవీశాఖాధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం సాయంత్రం పోలవరం మండలం వింజరం వద్ద ఉందని అంచనా వేయగా మంగళవారం ఉదయం దేవరపల్లి మండలం బంధపురం గ్రామశివారు వచ్చి తిరుగుముఖం పట్టిందని ప్రస్తుతం పెద్దపులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని పోలవరం గట్టుపైన చెట్లకు ట్రాప్ కెమెరాలు అమర్చామని తెలిపారు. పాపికొండల అభయారణ్యంలోకి పులి చేరవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాయంత్రం 5 దాటిన తర్వాత ఇంటికి పరిమితం కావాలని హెచ్చరికలు జారీ చేశారు. పొగాకు తోటల్లో ఆకురెల్చుకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే రెండురోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీవైఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీఓ సాత్విక్, శ్రీను, పోలవరం రేంజ్ సిబ్బంది, వన్యప్రాణి సంరక్షక సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పవన్ పర్యటన



అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

సమీక్ష తర్వాత మంగళగిరి పయనం

రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే : దుర్గేష్

రాజానగరం అసెంబ్లీ సీటుపై రాని స్పష్టత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం పర్యటన ముగిసింది. మంగళవారం ఏవీ అప్పారావు రోడ్డులోని గెయిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌చార్జులు, నాయకులతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పరిస్థితి, గెలుపు ఓటములపై పవన్‌కల్యాణ్ పార్టీ నాయకులతో చర్చించినట్టు సమాచారం. ప్రధానంగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాలపై ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టి వీటిపైనే ఎక్కువగా చర్చించినట్టు సమాచారం. రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే పవన్‌కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఎవరిని పోటీలోకి దింపుతారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. అయితే రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణకు టిక్కెట్ ఖరారు చేస్తారని అంతా భావించినా అలా జరగలేదు. నియోజకవర్గంలో పరిస్థితిని మాత్రమే పవన్‌కల్యాణ్ చర్చించినట్టు తెలిసింది. ఇదే విషయాన్ని రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణ కూడా స్పష్టంచేశారు. అయితే రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో టిక్కెట్ తనకే దక్కుతుందని భావిస్తున్నానని బలరామకృష్ణ చెబుతున్నారు. మరోపక్క రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీ ఖాయంగా కనిపిస్తోంది. నియోజకవర్గ పరిస్థితిపై పవన్‌కల్యాణ్‌తో సమావేశం తర్వాత కందుల దుర్గేష్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ టిక్కెట్ తనకు కన్‌ఫర్మ్ చేశారని స్పష్టం చేయడం గమనార్హం. ఇదిలాఉంటే, రాజమహేంద్రవరం వచ్చిన పవన్‌కల్యాణ్‌ను రాజమహేంద్రవరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ నాయకులు హరీష్‌మాధుర్ తదితరులు కలిశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ సుమారు గంటసేపు పవన్‌కల్యాణ్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చారు. సమీక్షలు అనంతరం సాయంత్రం 4.30 గంటల సమయంలో పవన్ కల్యాణ్ బయలుదేరి వెళ్లారు. పవన్ కల్యాణ్ రాకతో జనసేన పార్టీ కార్యాలయం వద్దకు ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

జీఎస్‌ఎల్‌లో ఏపీ మెడికోల క్రికెట్ టోర్నీ



రాజానగరం, ఫిబ్రవరి 20: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్ అండ్ డెంటల్ కళాశాలల పురుషుల క్రికెట్ క్రీడా పోటీలు రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల నుంచి 42 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్టు ఆయన చెప్పారు. నాకౌట్ పద్ధతిలో ఈ నెల 25 వరకూ ఐదు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. రానున్న రోజుల్లో రాత్రి సమయాల్లో సైతం క్రీడా పోటీలు నిర్వహించేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసే యోచన ఉన్నట్లు డాక్టర్ భాస్కరరావు ఈ సందర్భంగా తెలిపారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ త్రిమూర్తులు మాట్లాడుతూ తొలిరోజైన మంగళవారం 16 జట్లు తలపడ్డాయన్నారు. దీనిలో భాగంగా మొదటి రోజు పోటీల్లో సిబార్ డెంటల్ కళాశాలపై సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల, నారాయణ డెంటల్ కళాశాలపై గుంటూరు మెడికల్ కళాశాల, విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాలపై కర్నూలు విశ్వభారతి మెడికల్ కళాశాల, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలపై కర్నూలు మెడికల్ కళాశాల గెలుపొందినట్టు త్రిమూర్తులు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తజనంతో రత్నగిరి కిటకిట



వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యదేవుడి సన్నిధి మంగళవారం అశేష భక్తజనంతో పోటెత్తింది సుమారు 7200 వ్రతాలు జరిగాయి. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. సోమవారం రాత్రికే భక్తులు చేరుకోగా ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఈవో రామచంద్రమోహన్ ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయంలో పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. రద్దీ నియంత్రణలో భాగంగా అంతరాలయ ప్రదక్షిణ టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేశారు.

కులాల మధ్య ఐక్యతకు యువ నేతల కృషి అభినందనీయం

టీడీపీ యువ నేతలతో పవన్‌కల్యాణ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'కులాలను కలిపే ఆలోచనా విధానమనే మా సిద్ధం కోనసీమలో కార్యరూపంలోకి వచ్చింది. కులాల ఐక్యతకు కృషి చేస్తున్న యువనేతలందరికీ అభి నందనలు' అని పవన్‌కల్యాణ్ అన్నారు. రాజ మహేంద్రవరంలో మంగళవారం టీడీపీ నేతలు ఆదిరెడ్డి వాసు, గంటి హరీష్, వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజు, చిక్కాల గణేష్, యర్రంశెట్టి కాశీ, మండెల బాబీ తదితరులు పవన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'ఐక్యత ఒక్కరోజులో రాదు. ఇవాళ అందరూ ఒకతాటి మీదకు రావడం ఒక మార్పును సూచిస్తోంది' అని అన్నారు. కోనసీమలో కులాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. వైసీపీ కుట్ర ఫలిస్తే రావణకాష్టం అయ్యేదన్నారు. కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని తాను గతంలో రాజమహేంద్రవరంలోనే చెప్పానని, అన్ని వర్గాలను కలుపుకుని సోదరభావంతో ముందుకు వెళితే అది కచ్చితంగా గొప్ప సంకేతమవుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కులాల ఐక్యత ప్రభావం కనిపిస్తుందని ఆయన చెప్పారు. సమావేశంలో పిఠాపురం ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన భక్తులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 20: ధవళేశ్వరంలో జనార్ధనస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు జయజయ జనార్ధన అంటూ రథాన్ని లాగారు. మంగళవారం మధ్యాహ్నం కొండపై నుంచి స్వామి, అమ్మవార్లను పల్లకిపై తీసుకువచ్చి రథంపై ఆశీనులు చేశారు. అనంతరం రథం ముందు కుంభం పోసి నైవేద్యంగా సమర్పించారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పూజలు చేసి రథోత్సవం ప్రారంభించారు. రథం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి దిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. రాత్రికి కొండపై స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు దర్శించి పూజలు నిర్వహించారు. వివిధ సంస్థల, సంఘాల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్, పలువురు ఎస్ఐలు 100 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

సాహస పోలీస్‌కు సత్కారం



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగమంటే కృతజ్ఞతలను సైతం కోరుకోకుండా ప్రతిక్షణం ప్రజల రక్షణ కోసమే పాటుపడే గొప్ప అవకాశమున్న ఉద్యోగమని ఎస్పీ జగదీశ్ అన్నారు. సమయస్ఫూర్తితో ఏడుగురి ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచిన సాయుధ రిజర్వు విభాగం కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావును మంగళవారం ఆయన సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందించారు. సోమవారం కోనసీమ జిల్లాలోని బెల్లంపూడి సెంటర్ వద్ద కారు అదుపు తప్పి బైక్‌ని ఢీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లింది. కానిస్టేబుల్ శ్రీనివాసరావు తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరగడంతో కాల్వలోకి దూకి పీకలలోతు నీటిలోంచి ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రతలు) పి.అనీల్‌కుమార్, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

దయనీయంగా పాఠశాలలు

అసంపూర్తిగా మిగిలిన భవనాల్లోనే పాఠాలు



అసంపూర్తి భవనంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



రాజవొమ్మంగి ఫిబ్రవరి 20: రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పేరిట పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో పాఠశాలల భవనాలు లేవు. ఒకవేళ ఉన్నా అవి అసంపూర్తిగా ఉన్నాయి. మొల్లిమెట్ల గ్రామంలో గతంలో గ్రామస్థులు రేకు షెడ్డులు వేసి బడి కోసం ఏర్పాట్లు చేశారు. అయితే ప్రస్తుతం బడి అసంపూర్తిగా ఉన్న భవనంలోకి మారింది. షెడ్డులో ఉన్నప్పుడే విద్యార్థులు క్షేమంగా ఉన్నారని, ఇప్పుడు అసంపూర్తిగా ఉన్న భవనంలోకి బడి మార్చారని తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. మండలంలో అనేక పాఠశాలల భవనాలు నాడు నేడు పనులలో భాగంగా కూల్చివేసి నూతన భవనాలు నిర్మిస్తున్నారు. అయితే నాడు నేడు పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇప్పుడు ఆ భవనాలన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని అనేక పాఠశాలల పరిస్థితి ఇలానే ఉంది. భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని లేదా విద్యార్థులకు ప్రత్యామ్నాయ భవనాల్లో తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే వస్తే.. కష్టాలు చెప్పాలనుకున్నాం..

శనగనూరు గ్రామస్థుల నిరాశ

వై.రామవరం,ఫిబ్రవరి 20: తమ గ్రామానికి ఎమ్మెల్యే వస్తారని చెప్పడంతో ఏర్పాట్లు చేసుకుని ఎదురుచూసి రాకపోయేసరికి నిరాశకు గురయ్యామని శనగనూరు గిరిజన గ్రామ ప్రజలు ఆవేదన చెందారు. వివరాల్లోకెళితే అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి మంగళవారం వై.రామవరం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. పాతకోట పంచాయతీ పులుసుమామిడిలంక గ్రామంలో ఆమె గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి తమ గ్రామం శనగనూరుకు వస్తారనుకున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి రాకుండా వెళ్లిపోయారని తమనే ఎమ్మెల్యే వద్దకు రావాలంటూ చెప్పారని గిరిజనులు వాపోయారు. ఎదురుచూసి నిరాశ చెందిన తమతో వైసీపీ కార్యకర్త ఎమ్మెల్యే వద్దకు రమ్మన్నారంటూ ఉచిత సలహాలు ఇచ్చారని అన్నారు. తమ గ్రామంలో తాగునీటి సమస్యతో సతమతమవుతున్నామని కొండవాగు నీరు తాగుతున్న దుస్థితి ఉందని అలాగే పాఠశాల భవనం లేక చెట్టుకింద చదువులు కొనసాగిస్తున్నారని ఇలాంటి సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకుందామని అనుకుంటే ఆమె రాలేదని గిరిజనులు వాపోయారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ



కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న ఎస్పీ సతీ‌ష్‌కుమార్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20: ప్రమాదవశాత్తూ గన్ మిస్‌ఫైర్ అయ్యి తీవ్రంగా గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ కానిస్టేబుల్‌ను ఎస్పీ సుబ్రమణి సతీ‌ష్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 47 ఏళ్ల పంచత్ చరణ్ సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కాగా అతడు మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతమైన చింతూరులో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో చరణ్ ఆదివారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారిపడడంతో అతడి చేతిలో ఉన్న తుపాకీ మిస్‌ఫైర్ అయ్యింది. దీంతో బుల్లెట్ అతడి ఎడమ ఛాతీ కింద భాగంలో దిగింది. అది గమనించిన సహచర పోలీస్ సిబ్బంది క్షతగాత్రుడిని హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం సోమవారం చరణ్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి బుల్లెట్‌ను తొలగించారు. సర్జికల్ ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్(ఎస్ఐసీయూ)లో చికిత్స పొందుతున్న చరణ్‌ను కాకినాడ జిల్లా ఎస్పీ మంగళవారం పరామర్శించి మెరుగైన వైద్యం అందజేయాల్సిందిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీఆర్ విఠల్‌కు సూచించారు. ఎస్పీ వెంట డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, సీఐలు ఆకుల మురళీకృష్ణ, వాడవెల్లి సురేష్‌బాబు ఉన్నారు.

'నన్నయ'కు నిధులు మంజూరు



వీసీని సత్కరిస్తున్న ఎంపీ భరత్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో అనేక విశ్వవిద్యాలయాలు పీఎం-ఉష నిధులకు పోటీపడినా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఈ నిధులు మంజూరు కావడం గొప్ప విషయమని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నన్నయ వర్సిటీలో ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పీఎం-ఉష) బడ్జెట్ ప్రకటన ప్రారంభోత్సవాన్ని ఆన్‌లైన్‌లో వీక్షించేందుకు మంగళవారం వర్సిటీలో ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఈ నిధుల విడుదలకు కృషి చేసిన వీసీని అభినందించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులు రూ.8 కోట్లతో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ పీఎం-ఉష పథకంలో నన్నయ వర్సిటీకి రూ.20 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇందులో రూ.10 కోట్లతో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కోసం మల్టీపర్పస్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, మరో రూ.10 కోట్లతో ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, హాస్టళ్ల పునరుద్ధరిస్తామని చెప్పారు. అలాగే ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జియో ఇన్ఫర్మేటిక్స్, ఆక్వా కల్చర్ వంటి కోర్సుల ప్రయోగశాలలకు ఖర్చు చేస్తామన్నారు. డిజిటల్ రీసోర్స్ సెంటర్ స్థాపించడానికి, టీచింగ్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్, విద్యార్థులకు ఉపాధి కల్పించడానికి, అల్యూమినీ కనెక్ట్ పోర్టల్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన వీసీని ఎంపీ భరత్ సత్కరించారు. అలాగే విశ్వవిద్యాలయం అభివృద్ధిలో భాగస్వామ్యమవుతున్న ఎంపీని వీసీ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, హానరరీ ప్రొఫెసర్ కేవీ రావు, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ, ఈసీ సభ్యులు గంధం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి చక్రస్నానం

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 20: స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ శ్రీవరాహలక్ష్మి నృసింహస్వామి క్షేత్రంలో శ్రీ మధుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక చందనయాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయార్చకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆరాధన, హోమాలు, నిత్యరూప దర్శనం (చందన రూప సేవ) జరిగాయి. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. ధర్మకర్తలు వేదాన్తాచార్యపీఠం ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరపండి

అనపర్తిలో రిటర్నింగ్ అధికారికి రామకృష్ణారెడ్డి వినతి



అనపర్తిలో ఈఆర్వో మాధురికి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 20: అనపర్తి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటరు జాబితాలో అవకతవకలపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆర్వో నోటిఫికేషన్ వెలువడే వరకు సవరణలకు వీలున్న అంశాలపై చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ అనపర్తిలో కొందరు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, భూసేకరణ జరగకుండానే ఇళ్ల పట్టాల పంపిణీకి రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేయడం, కొన్నిచోట్ల డమ్మీ పట్టాలు పంపిణీ చేశారన్నారు. అలాగే అనపర్తి పోలీస్ సర్కిల్ కార్యాలయం ప్రయివేటు వ్యక్తుల కనుసన్నల్లో నడుస్తోందని ఆరోపించారు. అనపర్తిలో అక్రమ మద్యం సిండికేట్ నడుస్తుందని దీనిపై ఫిర్యాదు చేస్తే అసలు వ్యక్తిని విడిచి పెట్టి గుమస్తాపై కేసు నమోదు చేశారని ఆర్వోకు ఫిర్యాదులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బ్లూక్రాఫ్ట్' లేఆఫ్‌ను ఎత్తి వేయాలి

బిక్కవోలు, ఫిబ్రవరి 20: బలభద్రపురం శివారు కానేడులో వున్న బ్లూక్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ యాజమాన్యం లే ఆఫ్‌ను ఎత్తివేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేసారు. బిక్కవోలు తహశిల్దార్ కార్యాలయం వద్ద ఐదు రోజులుగా దీక్షలు చేస్తున్న కార్మికులను ఆయన మంగళవారం కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలలుగా కార్మికులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహశీల్దార్‌ను కలసి లేఆఫ్ ఎత్తివేతకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈయన వెంట టీడీపీ నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం: నల్లమిల్లి మహాలక్ష్మి

రంగంపేట, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో మహిళాభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని జి.దొంతమూరులో ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను మహాశక్తి కార్యక్రమం వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, కొమ్మన రాంబాబు, ఉద్దండ్రావు శ్రీను, ఆచంట వెంకటేశులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమానికి భరోసా: వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20: కారు డ్రైవర్ల సంక్షేమానికి పూర్తి భరోసా ఇస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో వివిధ ప్రాంతాలకు చెందిన కారుడ్రైవర్లు అసోసియేషన్‌గా ఏర్పడిన సుమారు 150 మంది గోకులపాటి రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన కూటమిలో చేరారు. ఈ సందర్భంగా వారికి వాసు పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో నెలన్నరలో టీడీపీ-జనసేన ప్రభుత్వం రాబోతుందని వెనువెంటనే డ్రైవర్ల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. జే ట్యాక్సులన్నీ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన డ్రైవర్లకు ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. డ్రైవర్ల అసోసియేషన్ టీఎన్‌టీయూసీలో భాగమైతే దాని ద్వారా డ్రైవర్ల సమస్యలకు సత్వర పరిష్కారానికి కృషి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, దొండపాటి సత్యంబాబు, వాసిరెడ్డి రాంబాబు, కుడుపూడి సత్తిబాబు, ఛాన్ బాషా, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, ద్వారా పార్వతి సుందరి, శెట్టి జగదీష్, మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం 49 డివిజన్‌లో దుత్తరపు గంగాధర్, నేమాలి శ్రీను సారథ్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో నాయకులు జరిగింది. ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఒక్కచాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ అటుపై అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశాడన్నారు. ఎంపీ భరత్.. నగరంలో చేపడుతున్న ప్రతి పనిలో 25శాతం కమిషన్ తీసుకుంటున్న అవినీతి పరుడని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రైవర్లను టీడీపీ-జనసేన కూటమిలోకి ఆహ్వానిస్తున్న ఆదిరెడ్డి వాసు

'ట్రూగుడ్' కృషి ప్రశంసనీయం: మంత్రి వేణు

చిత్రలేఖనం పోటీల్లో 'విశాఖ' విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



బహుమతులు అందుకొన్న విద్యార్థులతో మంత్రి వేణు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని కళాత్మక ప్రతిభను పాఠశాల స్థాయి నుంచే గుర్తించి ప్రోత్సహించే కార్యాచరణతో ముందుకు వెళుతున్న చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ సంస్థ 'ట్రూగుడ్' కృషి ప్రశంసనీయమని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. 'స్నాక్ బ్రాండ్' లోగో కోసం సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన మంగళవారం బహుమతులు అందజేశారు. పిల్లలు పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందన్నారు. పోషకాహారంలో ముందుండే చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలపై పిల్లలు అయిష్టత చూపిస్తారని, అందువల్ల చిరుధాన్యాలతో చేసిన చిక్కీలను ఇవ్వాలన్నారు. సంస్థ ఎండీ రాజు భూపతి మాట్లాడుతూ ఆర్ట్ కాంపిటీషన్‌లో 200 పాఠశాలల నుంచి 5వేల మందికిపైగా 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మంత్రి చేతుల మీదుగా మొదటి బహుమతి గెలుచుకున్న విశాఖపట్నం జిల్లా థానా గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.మధుతేజకు ల్యాప్‌టాప్, మచిలీపట్నానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎస్.కృష్ణవేణి, సత్యసాయి జిల్లా పేరూరు కు చెందిన 6వ తరగతి విద్యార్థి డి.నవదీప్‌లకు ద్వితీయ, తృతీయ బహుమతుల కింద ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ జగదీశ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా పోరు యాత్రలు

బీజేపీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ వీరన్నచౌదరి

రాజానగరం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన అంతమొందించాలనే నినాదంతో రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ఈ నెల 21నుంచి నియోజకవర్గంలో ప్రజాపోరు యాత్ర ప్రారంభిస్తున్నట్టు రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, కోకన్వీనర్ గణపతిరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాజానగరం మండలంలోని సీతారాంపురంలో బుధవారం ఉదయం 8.30గంటలకు ప్రజాపోరు యాత్ర ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి, ప్రజావ్యతిరేక పాలనపై నిలదీయనున్నట్టు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలన్నారు.

యాత్రల షెడ్యూల్... 21న సీతారాంపురం, కలవచర్ల, నరేంద్రపురం, రాజానగరం; 22న దివాన్‌చెరువు, ఫరిజెల్లిపేట, కానవరం, పల్లకడియం; 23న తోకాడ, కొత్తతుంగపాడు, శ్రీకృష్ణపట్నం, శ్రీరాంపురం; 24న పుణ్యక్షేత్రం, కొండగుంటూరు, సంపత్‌నగరం, లాలాచెరువు; 25న కోరుకొండ మండలంలోని పశ్చిమగోన గూడెం, నరసాపురం, కనుపూరు, గాదరాడ; 26న గాడాల, మధురపూడి, బూరుగుపూడి, బుచ్చంపేట; 27న దోసకాయలపల్లి, మునగాల, కాపవరం, కోరుకొండ; 28న బొల్లెద్దుపాలెం, రాఘవపురం, కోడికేశవరం, శ్రీరంగపట్నం; 29న బొబ్బిలంక, జాలిమూడి, కాటవరం, ఇనగంటివారిపేట, మార్చి 1న సీతానగరం, ముగ్గళ్ల, కూనవరం గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్రలు నిర్వహించనున్నట్టు వీరన్నచౌదరి తెలిపారు.

సుభద్రంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష

రంగంపేట, ఫిబ్రవరి 20: మండలంలోని సుభద్రంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కూటి సాయితాతారావు అధ్యక్షతన రంగంపేట పీహెచ్‌సీ వైద్యుడు కె.చిన్నారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 364 మందికి వైద్య సేవలందించారు. ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు అందించారు. వైద్యులు సాయి ప్రణీత్, పి.జనార్దన్ సేవలందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, ల్యాబ్ టెక్నీషియన్ మణికంఠ, గ్రామ కార్యదర్శి కుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్ట్

51 మద్యం సీసాలు, 35 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట, ఫిబ్రవరి 20: రంగంపేట ఎస్ఈబీ అధికారులు మంగళవారం అనపర్తి, దొడ్డిగుంటలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సత్యశ్రీ డాబా రెస్టారెంట్ వద్ద మద్యం అమ్ముతున్న దుమ్మల రావును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 53 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. అలాగే రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో సారా తయారు చేస్తున్న మేడిశెట్టి నరేష్‌ను అరెస్ట్ చేసి, అతను నుంచి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో చదువుతున్న ఓ బాలుడి అదృశ్యంపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ వివరాల ప్రకారం.. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని ఎస్సీ హాస్టల్‌లో పెద్దాపురానికి చెందిన పి.ప్రేమ్‌కుమార్ ఉంటూ ఏడో తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం స్కూల్‌కి వెళ్లి తిరిగి హాస్టల్‌కి రాలేదని, వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గ్రాసిమ్ సంస్థ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట, ఫిబ్రవరి 20: అనపర్తి నియోజక వర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న బలభద్రపురంలోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ సేవలు అభి నందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బాలవరంలో ఎస్సీ, బీసీ ఏరియాల్లో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అలాగే వడిశలేరులో పెరికీల ఏరియాలో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. అనంతరం శ్రీ భజేన్నారాయణ స్వామి అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, కొల్లాటి ఇశ్రాయేలు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సత్తి సత్తిబాబు, నలమాటి బుల్లిరాజు పాల్గొన్నారు.

ఊలపల్లిలో కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



ఊలపల్లిలో కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బిక్కవోలు, ఫిబ్రవరి 20: ఊలపల్లిలో కనెక్ట్ టు ఆంధ్రా సీఈవో, ఆగ్రోస్ చైర్మన్ కోట్ల శివశంకరరావు సహకారంతో నిర్మించే కల్యాణ మండపానికి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన గ్రామంలో గ్రాసిం సంస్థ నిర్మించే కళావేదికకు శంకుస్థాపన చేశారు. కొంకుదురులో గ్రాసిం సంస్థ నిర్మించిన కళావేదికను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సత్తి వీరమణి, బండారు రమ్య, ఎంపీటీసీలు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, బండారు శివ, పోతుల ప్రసాదరెడ్డి, సత్తి నాగిరెడ్డిరాజా పాల్గొన్నారు.

కోరుకొండ తిరునాళ్లు ప్రారంభం

గరుడ వాహనంపై నరసింహస్వామి గ్రామోత్సవం



కోరుకొండలో గరుడ వాహనంపై ఊరేగుతున్న నరసింహస్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 20: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్లు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి ఉత్సవమూర్తులను ఒక పల్లకిలోను, భగవత్‌రామానుజులు, నమ్మాళ్వారుల ఉత్సవమూర్తులను మరో పల్లకిలో ఆశీనులను చేసి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలతో తోడ్కొచ్చి గరుడ వాహనంపై ఆశీనులను చేశారు. మాడవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. అనంతరం స్వామి వారిని ఉత్సవమూర్తులను కొండపైకి తోడ్కొని వెళ్లారు. అక్కడే ఐదు రోజులపాటు సేవాకాలం నిర్వహిస్తారు. కార్యక్రమంలో దేవస్థానం అనువంశక ధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో పలువురు అర్చక, అధ్యాపక స్వాములు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

తమ్మన్నదొర జిల్లా ప్రకటించాలి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20: రంపచోడవరం కేంద్రంగా స్వాతంత్ర సమరయోధుడు, తొలిగిరిజన వీరుడు కారం తమ్మన్నదొర పేరుతో జిల్లా ప్రకటించాలని తమ్మన్నదొర సాధన కమిటి డిమాండ్ చేసింది. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారులు అయినాపురపు సూర్యానారాయణ, సాధన కమిటీ నాయకులు తెల్లం శేఖర్ మాట్లాడారు. అల్లూరి జిల్లాలోని రెండు ఐటీడీఏల పరిధిలోని 11మండలాలను కలిపి రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో మడకం బంగారుబాబు, పలివెల పోశమ్మ, మద్దిపాటి సతీష్, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

గోకవరం, ఫిబ్రవరి 20: మండలంలోని పలు గ్రామాల్లో భీష్మ ఏకాదశి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రంపయర్రంపాలెంలో కొండపై ఉన్న పాండవులను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కొండ కింద భాగాన భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

మహిళ అరెస్టు.. బీరు సీసాలు స్వాధీనం

సీతానగరం, ఫిబ్రవరి 20: మండలంలోని మిర్తిపాడు గ్రామానికి చెందిన కోరాడ వెంకటలక్ష్మిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఆమె నుంచి 9 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

కడియం, ఫిబ్రవరి 20: మండలంలోని దుళ్ళలో శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ మొదలు కొని స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. సాయంత్రం సహస్రదీపాలంకరణ, స్వామివారు, అమ్మవార్ల గరుడ వాహన సేవ జరిగింది. అలానే స్వామివారి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది.

సామాజిక న్యాయానికి ప్రాధాన్యమివ్వాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు మరింత సమన్వయంతో పని చేస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖతో కలిసి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ థీమ్‌గా 'అంతరాలను తగ్గించడం, పొత్తులను నిర్మించడం' నిర్ణయించారన్నారు. సమానత్వ హక్కు చట్టం, మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలు, ప్రభుత్వాలకు వారధిలా పనిచేస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ చేరువ చేయడమే డీఎల్ఎస్ఏ ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్మంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఎం.సందీప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో మోసం

హోం మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న యూత్ కాంగ్రెస్



మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న యువజన కాంగ్రెస్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కాన్వాయ్‌ను రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు నేతృత్వంలో 20 మంది సభ్యులు అడ్డుకున్నారు. మంగళవారం రాత్రి ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం వచ్చిన హోం మంత్రి వనిత కాన్వాయ్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు అడ్డగించి ముట్టడించారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాత్రి 10:40 గంటలకు వారిని వ్యక్తిగత పూచికతులపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల మంది నిరుద్యోగులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వెంటనే 30వేల డీఎస్సీ పోస్టులను విడుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్రంలోని నిరుద్యోగులందరితో కలిసి మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబి, బీఆర్ గౌస్, తోడేటి సందీప్ ఐశ్వర్, సుశీల్‌కుమార్, రామ్ సూరిరెడ్డి, శేషగిరి, బట్టు శ్రీకాంత్, రామ్‌సింగ్, అంకెం సీతారామ్, కైపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడు తల్లి చెంతకు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రైల్వే పోలీస్‌ల(జీఆర్పీ) చొరవతో మతిస్థిమితం లేని యువకుడు తల్లి చెంతకు క్షేమంగా చేరాడు. సీఐ విజయ్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యు.కొత్తపల్లి మండలం కుండవరానికి చెందిన 19ఏళ్ల కొమ్మనబోయిన దుర్గాప్రసాద్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి పారిపోయాడు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులకు సమాచారం అందడంతో ప్లాట్‌ఫాంపై డ్యూటీలో ఉన్న సిబ్బంది అప్రమత్తమయ్యారు. కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో దుర్గాప్రసాద్‌ని గుర్తించి రైలు దించి స్టేషనుకు తీసుకెళ్లారు. తల్లి కొమ్మనబోయిన లోవను పిలిపించి అప్పగించారు.

రేపు రజక భరోసా బాట ఆత్మీయ సభ

అనపర్తి, ఫిబ్రవరి 20: ఈనెల 23న బిక్కవోలులో జరిగే రజక భరోసా బాట ఆత్మీయ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక చైతన్య సేవా సంస్థ అధ్యక్షుడు కాకినాడ రామారావు పిలుపునిచ్చారు. మంగళవారం అనపర్తిలో సభ పోస్టర్‌ను రజక సంఘ నేతలు ఆవిష్కరించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యామినీ	: మేడమ్ వెబ్
సూర్యాప్యాలస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
అశోక	: ------
ఊర్వశి	: యాత్ర-2
రంభ	: లాల్‌సలామ్
మేనక	: సూర్య డ్రిల్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: ట్రూ లవర్
వీఎస్ మహల్(నామవరం)	: ఊరుపేరు భైరవకోన
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ఊరుపేరు భైరవకోన
వెంకటసూర్య(కడియం)	: ఊరుపేరు భైరవకోన
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఊరుపేరు భైరవకోన
రామకృష్ణ(కోరుకొండ)	: ఊరుపేరు భైరవకోన
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఊరుపేరు భైరవకోన
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహల్(రంపచోడవరం)	: ఊరుపేరు భైరవకోన
నవయుగ(చింతూరు)	: ఊరుపేరు భైరవకోన







రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో పవన్.. పక్కన హరిప్రసాద్, దుర్గేష్

ముగిసిన పవన్ పర్యటన

- సమీక్ష తర్వాత మంగళగిరి పయనం
- రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే: దుర్గేష్
- రాజానగరం అసెంబ్లీ సీటు అభ్యర్థిపై రాని స్పష్టత



వైభవంగా అంతర్వేది రథోత్సవం

వేలాది మంది గోవింద నామస్మరణ మధ్య అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథోత్సవం మంగళవారం మధ్యాహ్నం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజా వారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు పట్టింది. గోవింద, నారసింహ నామస్మరణలతో భక్తులు రథాన్ని లాగారు..

ఇవి అక్రమాలు కావా?



ఎన్జీటీ బృందానికి కనబడకుండా తుప్పల్లో ఎక్స్‌కవేటర్.. వారెళ్లాక రోడ్డెక్కి.. మళ్లీ రెడీ..

- ఎన్జీటీ బృందం రాకతో ఇసుక ర్యాంపుల మూత
- వారెళ్లాక మళ్లీ మొదలు
- కడియపులంక ర్యాంపులో వాస్తవ పరిస్థితులపై ఆరా
- స్వయంగా ర్యాంపులో పరిశీలన
- 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే జరిగింది



కడియపులంక ఇసుక ర్యాంపులో ఎన్జీటీ బృందంతో కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బృందం వస్తుందనే సమాచారం అందుకున్న ఇసుక ర్యాంపుల నిర్వాహకులు మొత్తం ర్యాంపులను మంగళవారం మూసివేశారు. సోమవారం రాత్రి నుంచే మూసివేసి డ్రెడ్జింగ్ పడవలు, ఎక్స్‌కవేటర్ యంత్రాలను దాచేశారు. గాయత్రీ ర్యాంపులలోని తుమ్మచెట్ల మధ్యలోనూ, గోదావరి లంకల్లోని తుప్పల్లోనూ డెడ్జింగ్ బోట్లను, ఎక్స్‌కవేటర్లను దాచేశారు. కాతేరులో ఏటిగట్టుకు ఇవతల వరి పొలాలకు ఏటిగట్టుకు మధ్యలో యంత్రాలను దాచేశారు. అలాగే మంగళవారం డ్రెడ్జింగ్ ఆపేశారు. ర్యాంపుల్లో కేవలం ఇసుక గుట్టలు మాత్రమే ఉన్నాయి. పడవలు, యంత్రాలు, మనుషులు కూడా కనిపించలేదు. ఒకటి రెండు చోట్ల మనుషులు స్వయంగా ఇసుక తీస్తున్న బోట్లు కనిపించాయి. అంతా గప్‌చిప్. ఈ తతంగాన్ని 'ఆంధ్రజ్యోతి ముందే బయటపెట్టిన సంగతి తెలిసిందే. సాయంత్రం ఎన్జీటీ బృందం వెళ్లిపోగానే, ఇసుక పెత్తందారు ఆర్కే నుంచి డ్రెడ్జింగ్ మొదలుపెట్టేయండని, అధికారులు వెళ్లిపోయారనే సమాచారం వచ్చింది. దీంతో దాచిన డ్రెడ్జింగ్ బోట్లు, ఎక్స్‌కవేటర్ యంత్రాలు రాత్రికి బయటకు వచ్చేశాయి. ఇక్కడ అక్రమాలు జరగకపోతే ఎన్జీటీ బృందానికి భయపడవలసి అవసరం ఏముందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రోజూ కోట్ల రూపాయల విలువైన ఇసుక అక్రమాలు జరుగుతున్నాయి. నెలకు వైసీపీ పెద్దలకే రూ.12 కోట్ల కప్పంకడుతున్నట్టు ఓ నిర్వాహకుడు బహిరంగంగానూ ర్యాంపుల్లో చెబుతుండడం గమనార్హం. స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఇతర అధికారులా ఏమనుకుంటున్నారో, ఏం చేస్తున్నారో ఎవరికీ అర్థంకావడంలేదు. ఎవరూ పట్టించుకోవడంలేదు. పెద్దలు పెట్టే ఒత్తిడికి అందరూ లొంగిపోయారు.

కడియపులంక, బుర్రిలంక ర్యాంప్‌లను పరిశీలించిన ఎన్జీటీ బృందం

కడియం, ఫిబ్రవరి 20: మండల పరిధిలోని కడియపులంక, బుర్రిలంకలలోని ఇసుక ర్యాంపులను జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) బృందం సభ్యులు పరిశీలించారు. మంగళవారం కడియపులంక, బుర్రిలంక ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలను అధ్యయనం చేసేందుకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ డైరెక్టర్ శాస్త్రవేత్త డి.సౌమ్య, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, పర్యావరణ కాలుష్య నియంత్రణ ఇంజనీర్ (కాకినాడ) బీహెచ్ఎల్ సందీప్ రెడ్డి, ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్, మైన్స్ అండ్ జియాలజీ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎన్జీటీ బృందం అధ్యయనం చేసింది. ఈ పర్యటనలో ఇరిగేషన్ హెడ్ వర్క్స్ ఈఈ ఆర్ కాశీ విశ్వేశ్వరరావు ఉన్నారు. తర్వాత కాటన్ బ్యారేజీ మరమ్మతులను కలెక్టర్ పరిశీలించారు. బొబ్బర్లంక, పిచ్చుకలంక వద్ద కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి నిమిత్తం ప్రతిపాదనలు పంపినట్టు కలెక్టర్‌కు ఇరిగేషన్ అధికారులు వివరించారు.

అప్పుల 'పాలు'



- బ్యాంకు రుణంతో ఇరికించి..
- అమూల్‌కే పాలు పోయాలని హుకుం
- ఆర్థిక భరోసా అంటూ గొప్పలు
- మహిళా సాధికారత మాటున వంచన
- 'చేయూత'కు గేదెకు లింక్
- జీతం సర్కారుది.. సేవ ప్రైవేటు సంస్థకు
- 'జగనన్న పాల వెల్లువ' వెనుక బలవంతపు 'పథక' రచనా వ్యూహం

ఇదో 'అమూల్'యమైన దగా. మన దగ్గర ఉత్పత్తి అవుతున్న పాలు ఇతర రాష్ట్రానికి తరలిస్తారు. ఈ క్రమంలో.. మహిళా సాధికారత అంటూ గొప్ప గొప్ప మాటలుంటాయి. ఆర్థిక భరోసా అంటూ రుణాలిస్తారు. మహిళలను అప్పులపాలు చేస్తూ.. 'చేయూత'కు గేదెలకు లింక్ పెట్టే బృహత్తర ప్రణాళికను అమలుచేస్తారు. చివరకు జగనన్న పాల వెల్లువ పథకం పేరుతో అమూల్ పాల సంస్థ కోసం ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి మార్కెటింగ్ చేసి పాలన్నీ అప్పగిస్తుంది. తెల్లటి పాలలా ఈ పథకం పైకి స్వచ్ఛంగా కనిపిస్తున్నా తెరవెనుక జరుగుతున్న దోపిడీ తంతుపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు సంస్థకు 'అమూల్'యమైన సేవ చేస్తూ ప్రభుత్వం తరిస్తుండడంతో జగనన్న పాల వెల్లువలో పడి పాడి రైతులు విలవిల్లాడుతున్నారు. పాలకులు పగతో అమలు చేస్తున్న పన్నాగం అని సరిపెట్టుకుందామన్నా.. ఆ పన్నాగంలోకి పాడి రైతులను బలవంతంగా లాగుతున్నారు. పాలవెల్లువ పథకంలో భాగంగా చేయూత లబ్ధిదారులకు గేదెలకు లింక్ పెట్టి పాలను అమూల్‌కి దాసోహం చేసి మహిళలను ప్రభుత్వం అప్పులపాలు చేస్తోంది. అమూల్ కోసం 'పథకం' కచ్చితంగా పారించాల్సిందేనంటూ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. మరోవైపు ప్రజాధనాన్ని అమూల్‌యమైన సేవకు వెచ్చించి తరిస్తోంది. దానిలో భాగంగా జిల్లాలో గోపాలపురం మండలం చిట్యాలలో మరో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ని రెండు మూడు రోజుల్లో ప్రారంభించనుంది. ఇలా 'కష్టం రైతుది.. సుఖం అమూల్‌ది.. పన్నాగం ప్రభుత్వానిది.. పగ జగన్‌ది' అన్న చందంగా మారడంతో పాలవెల్లువ ఘొల్లుమంటోంది. జగన్ టార్గెట్‌లో భాగంగా ఓ ప్రైవేటు డెయిరీపై పగ సాధించడానికి అమూల్‌ని తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ డెయిరీ అయిన 'విజయ'నూ తొక్కేశారు. ఇలా 2021 డిసెంబరు నుంచి పాడి రైతులు వరం మాటున చిక్కుల్లో పడ్డారు. అమూల్ (ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్)కి పాలు దోచిపెట్టడం మొదలైంది. 2022 జూలైలో అది రాష్ట్రమంతా పాకింది. ఒక్కో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌కి రూ.18 లక్షల చొప్పున జనం సొమ్ము ఖర్చుచేశారు. అయితే 2023 జూన్‌కి 60 శాతం పాల సేకరణ కేంద్రాలు పడుకున్నాయి. ఇతర డెయిరీలు పాలుపోసే రైతులకు సకాలంలో చెల్లింపులు జరుపుతూ బోనస్ కూడా ఇవ్వడంతో వాటికే పాలుపోయడానికి రైతులు మొగ్గు చూపారు. దీంతో అమూల్‌కి పాలపోత పెంచేలా ప్రభుత్వం పన్నాగానికి తెరతీసింది. చేయూత లబ్ధిదారులకు పాలవెల్లువకు లింక్ పెట్టింది. ఇష్టం ఉన్నా లేకున్నా బ్యాంకులో రుణం తీసుకొని గేదెను కొని పాలు పితికి అమూల్‌కి పోయాల్సిందే. దీని కోసం ప్రభుత్వ శాఖలను రంగంలోకి దింపింది. నయానో భయానో అమూల్‌కి లబ్ధి చేకూర్చాలని ఆదేశించింది.

● ఇదో రకం వంచన

తమ ఉత్పత్తులను గిట్టుబాటు వచ్చేచోట/వారికి అమ్ముకునే హక్కు ప్రతి రైతుకూ ఉంటుంది. జగన్ ఆ హక్కునూ హరించేసి తన పంతం కోసం మహిళా రైతులను పణంగా పెట్టారు. పశుసంవర్ధక, సహకార, డీఆర్‌డీఏ శాఖలను రంగంలోకి దింపారు. చేయూత ద్వారా లబ్ధిపొందుతున్న మహిళా రైతుల వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించి వారిని గేదెలు కొనుక్కొనేలా ఒత్తిడి చేస్తున్నారు. చేయూత ద్వారా వచ్చే డబ్బులకు మరికొంత బ్యాంకు ద్వారా అప్పు చేయించి గేదెను కొనుక్కొనేలా చేస్తున్నారు. అలా చేయకపోతే ఇప్పటికే ఉన్న పింఛను, రైతు భరోసా వంటి ఉపకారాలను రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారు. కచ్చితంగా అమూల్ కేంద్రాలకే పాలను పోయాలనే షరతు విధిస్తున్నారు.

● సర్కారీ సేవ.. ఉచితంగా..

మూడు శాఖల్లోని క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచీ అధికారుల వరకూ ప్రభుత్వ హుకుంతో అమూల్‌కి పాలపోత పెంచే పనిలో మునిగిపోయారు. వారి విధులను పక్కన పెట్టి చేయూత లబ్ధిదారులను 'పథకం'లో చేర్చడంలో బిజీ అయిపోయారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్న శాఖలు.. ప్రజల సేవలను వదిలేసి అమూల్ సేవలో తరలిస్తున్నారు. దీనికోసం ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్ మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ (ఏపీడీడీసీఎఫ్)ని ధారాదత్తం చేసింది. ఇప్పటికే పాడి ఉన్న రైతులకు పూచీకత్తు లేకుండా రూ.30వేల వరకూ పెట్టుబడికి, పాడి ఉన్నా లేకున్నా పాడి పశువుల కొనుగోలుకు రూ.1.60 లక్షల రుణం ఇప్పిస్తున్నారు. వాయిదాలు రైతులే చెల్లించుకోవాలి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చేతులెత్తేయగా, వివిధ బ్యాంకుల తలవొంచి అప్పులు మంజూరు చేయిస్తున్నారు. రుణం పొందినవాళ్లు అమూల్‌కే పాలు అమ్మాలి. ఇదీ షరతు. ఇక జిల్లాలోని పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ, కో-ఆపరేటివ్ శాఖల్లోని సుమారు 500 మంది ప్రభుత్వోద్యోగులు అమూల్ సంస్థ కోసం పనిచేస్తున్నారు. అమూల్‌కి సంబంధించి జిల్లాకో కో-ఆర్డినేటర్ మాత్రమే ఉండడం గమనార్హం. ఆ కంపెనీ పనులన్నిటికీ ప్రభుత్వోద్యోగులనే వాడేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే రోజుకు 400 గ్రామాల నుంచి సరాసరి 5,500 లీటర్ల పాలను అమూల్‌కి పోయిస్తున్నారు. రోజూ పోసే రైతులు 560 మంది ఉండగా.. వారంలో రెండు మూడు నాగాలు ఉండేవారు 2,300 మంది ఉన్నారు. వీళ్లను ఇప్పటికే రుణాలతో బిగించేశారు. వలంటీర్ల సహాయంతో హౌస్‌హోల్డ్ డేటా ద్వారా 7,490 మంది పాడి ఉన్న/లేని మహిళా రైతులు చేయూత ద్వారా లబ్ధి పొందుతున్నారని గుర్తించారు. ఇప్పుడు వాళ్లందరికీ రుణాలు ఇప్పించి పాలవెల్లువ పథకంలో చేర్చి అమూల్‌కే పాలుపోసేట్లు చేయాలంటూ అధికారులపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తోంది.

● మోసపూరిత పథకాల్లో ఇదొకటి..

ఒకవైపు పాడి రైతులను ప్రభుత్వం అలా దగా చేస్తోంటే.. ఇటు అమూల్ సిబ్బంది కూడా 'మేమేం' తక్కువ పితుకుతామా? అన్న చందంగా తయారయ్యారు. ప్రతి గ్రామంలో అమూల్ పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలో ఆరు బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లున్నాయి. అక్కడి నుంచి ఆటోమ్యాటిక్ మిల్క్ కూలింగ్ యూనిట్లకు పాలు వెళ్తాయి. పాలను రైతులు గ్రామాల్లోని సేకరణ కేంద్రాలకు తీసుకువచ్చిన సమయంలో అక్కడి అమూల్ ఉద్యోగి పాలలోని స్వచ్ఛతను మిల్క్ అనలైజర్ పరికరం ద్వారా అంచనా వేస్తారు. పరికరాన్ని ట్యాంపరింగ్ చేయడంతో వాస్తవ స్వచ్ఛతకంటే తక్కువగా ఫలితం వస్తుంది. పాయింట్లలో తేడాలు రైతు జేబుకు చిల్లుపెడుతున్నాయి. ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం ఆధారంగా పాల స్వచ్ఛతను నిర్ధారిస్తారు. ఫ్యాట్ శాతం 5.50, 5.60, 5.70.. ఇలా 11.00 వరకూ, ఎస్ఎన్ఎఫ్ శాతం 8.70, 8.80, 8.90, 9.00 రీడింగ్‌లో ఉంటుంది. 6% ఫ్యాట్, 9% ఎస్ఎన్ఎఫ్ ఉంటే లీటరుకు రూ.45 ఇస్తారు. అదే ట్యాంపరింగ్ చేసి రీడింగ్‌లను 5.50 శాతం ఫ్యాట్, 9 శాతం ఎస్ఎన్ఎఫ్ అని చూపిస్తే లీటరుకు రూ.40.75 మాత్రమే ఇస్తారు. ఇలా కొన్ని వేలమంది రైతుల నుంచి రూ. లక్షల్లో మోసం సొమ్మును సంస్థ ఖాతాలో వేసుకుంటుందనే ఆరోపణలున్నాయి. ఆరునెలల కిందట నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామంలోని అమూల్ పాలసేకరణ కేంద్రంపై అధికారుల బృందం దాడి చేసి మిల్క్ అనలైజర్‌ని ట్యాంపరింగ్ చేయడం ద్వారా రైతులను మోసగిస్తున్నారని గుర్తించారు. కేసు నమోదు చేయడంతోపాటు రూ.5 లక్షల జరిమానా విధించారు. వెలుగు చూడనవి ఎన్నో. ఇక అమూల్ సిబ్బంది పాల స్వచ్ఛత కోసం నిర్దేశిత పరిమాణం 30 మిల్లీలీటర్ల (ఎన్ని లీటర్ల పాలకైనా) కంటే ఎక్కువగా తీసుకొని పరీక్ష అనంతరం అవి రైతుకు ఇవ్వకుండా విడిగా పెట్టుకున్న క్యాన్‌లో పోసుకుంటారు. ప్రత్యేక క్యాన్ పోసుకునే పాల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు గ్రామంలోని మహిళా డైయిరీ సహకారం సంఘానికి ఇస్తామని చెబుతున్నారు. నిర్దేశిత పరిమాణంకంటే ఎక్కువ పరిమాణంలో తీసు కోవడం రైతులను దోపిడీ చేయడమా? కాదా? అనే ప్రశ్న వస్తోంది.

● అమూల్యమైన అబద్ధాలెన్నో..

మహిళను మోసం చేయడానికి ప్రభుత్వం అబద్ధాలను వల్లెవేయిస్తోంది. గ్రామాల్లోని ఆర్థిక పరిస్థితిని ఆసరాగా తీసుకొని రూ.30 వేల నుంచి రూ.1.60 లక్షల వరకూ చేతిలో పడుతుందని మహిళా రైతులకు ఆశ కల్పిస్తున్నారు. 'చేయూత' ద్వారా వస్తున్న రూ.18 వేలు, బ్యాంకు రుణం కలిపి పశువును కొనుగోలు చేసే విషయంలో సహాయం చేస్తామని చెబుతున్నారు. బ్యాంకులకు తీసుకెళ్లి లోను దరఖాస్తులు నింపిస్తున్నారు. ఆ క్రమంలో తాము అమూల్‌కే పాలు విక్రయిస్తామనే పత్రాలపై సంతకాలు చేయిస్తున్నారని తెలుస్తోంది. దీంతో చేసేదేమీలేక అమూల్‌కే పాలు పోస్తున్నారు. ఇతర కంపెనీల నుంచి అధికంగా సొమ్ములు వచ్చే పరిస్థితి లేదు. పైగా ఉత్పత్తి అయిన పాలన్నీ అమూల్‌కే వెళ్తున్నాయో లేదో కూడా నిఘా పెట్టారు.

బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవు

- వదంతులు వ్యాప్తి చేయొద్దు : డీఏహెచ్‌వో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని.. వదంతులను నమ్మవద్దని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లాలోని ఓ ఘటన నేపథ్యంలో అపోహలను వ్యాప్తి చేస్తున్నారన్నారు. కోడిమాంసం, కోడిగుడ్లు తినడం వల్ల బర్డ్‌ఫ్లూ రాదన్నారు. ఆ వైరస్ (హెచ్5 ఎన్1) గాలి ద్వారా వ్యాప్తి చెందదన్నారు. బర్డ్‌ఫ్లూ సోకిన/చనిపోయిన వాటిని పట్టుకున్నప్పుడు ముక్కుద్వారా.. అదే చేతులను కళ్లల్లో, ముక్కులో, నోటిలో పెట్టుకున్నప్పుడు మానవ శరీరంలోకి వైరస్ ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకూ బర్డ్‌ఫ్లూ మనిషికి సోకడం వల్ల చనిపోయిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. గుడ్లు, కోడి మాంసాన్ని ఉడికించి తినడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదన్నారు. ఇప్పటికే జిల్లాలో సర్వే నిర్వహించి ముందస్తు జాగ్రత్తలో భాగంగా 38 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోడానికి సన్నద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో కోటి నలభై లక్షల వరకూ గుడ్లు పెట్టే కోళ్లు, 10 లక్షల వరకూ బ్రాయిలర్, ఇళ్ల వద్ద 7 లక్షల నాటుకోళ్ల పెంపకం ఉందన్నారు. గుడ్ల ఉత్పత్తిలో ఒకేసారి 10 శాతం తగ్గుదల కనిపించినా, పదుల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నా, ఇతర పక్షులు గుంపులుగా మృత్యువాత పడుతున్నా బర్డ్‌ఫ్లూగా అనుమానించవచ్చన్నారు. ఈ లక్షణాలు ఎవరైనా గుర్తిస్తే వెంటనే పశువైద్యాధికారులకు తెలియజేయాలని సత్యగోవింద్ కోరారు. ఇష్టానుసారం కాలువలు, చెరువులు తదితర చోట్ల పారవేయవద్దని ఆయన సూచించారు.



ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

- కడియం మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో సీఐకి వినతిపత్రం

కడియం, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడాన్ని కడియం పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరుతూ మంగళవారం కడియం పాత్రికేయులు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి తులసీధర్‌కు, అనంతరం డిప్యూటీ తహశీల్దారు జనార్ధన్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కడియం పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం : ఏఐకెఎంఎస్

రాజానగరం, ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు తీవ్రంగా ఖండించారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాకినాడ జీజీహెచ్‌లో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20: రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఓ యావజ్జీవ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. గుంటూరు జిల్లా గుంటూరు అర్బన్ ఆర్.అగ్రహారంపేటకు చెందిన ఆలాపాటి సాంబశివరావ్(85) 2019లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు కావడంతో అతడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. అతడు 2021 జూలై 3వ తేదీ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో అతడిని ఇటీవల రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఎస్కార్ట్ పోలీసుల సహాయంతో ఈనెల 13న కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సాంబశివరావు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలియజేశారు.







పోతవరం సీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం.. ముందు రోజు సంతకాలు చేసిన హాజరు పట్టీ

పోతవరం పీహెచ్‌సీలో అందుబాటులో లేని వైద్యులు

- తూతూమంత్రంగా స్టాఫ్ నర్సులే అందిస్తున్న సేవలు
- ఫ్రిజ్ ఉన్నా ఉపయోగించని వైనం
- వ్యాక్సిన్ కావాలంటే 10 కి.మీ నల్లజర్ల వెళ్లి తీసుకోవాలి
- ఫీల్డ్ పేరుతో ముందురోజే హాజరుపట్టీలో సంతకాలు
- 14 మంది స్టాఫ్‌లో డ్యూటీలో ఉన్నది కేవలం ఆరుగురే
- మిగతా వారు ఫీల్డ్ అంటూ ఆసుపత్రికే రాకుండా డ్యూటీ చేస్తున్నట్టు చెప్పుకుంటున్న వైనం

నల్లజర్ల, ఫిబ్రవరి 20 : పేరుకే అది ప్రభుత్వాసుపత్రి. సేవల్లో మాత్రం అథమం. పోతవరం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ఫీల్డ్ పేరుతో క్షేత్ర స్థాయి పర్యటన ఉన్నట్టు డాక్టర్లు, ఎంపీహెచ్‌వో, పీహెచ్ఎన్ ఆసుపత్రికి సక్రమంగా రావడం లేదని, ఉన్న స్టాఫ్ నర్సులే తూతూమంత్రంగా మాత్రలు ఇచ్చి పంపేస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఆసుపత్రిలోని పరిస్థితిని పరిశీలించినప్పుడు ఇక్కడ 14 మంది స్టాఫ్ ఉండాల్సి ఉండగా, విధుల్లో కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఆసుపత్రికి రాకుండానే హాజరుపట్టీలో ముందురోజు సంతకాలు చేసినట్టు సమాచారం. ఇక ఆసుపత్రి విషయానికి వస్తే వ్యాక్సిన్ భద్రపర్చుకునేందుకు ఫ్రిజ్ ఉన్నప్పటికీ వినియోగించడం లేదు. దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లజర్ల సీహెచ్‌సీ నుంచే వ్యాక్సిన్ తీసుకుని వస్తున్నారు. బీపీ మీటరు విద్యుత్ ఉన్న సమయంలోనే పనిచేస్తోంది. డాక్టర్లు ఇద్దరు అందుబాటులో లేకపోవడం వల్ల కేసులు అన్ని ఎక్కువగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ ఆసుప్రతిలో ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చినా సమయానికి వైద్యులు లేకపోవడం వల్ల రోగులు నిరాశగా వెళ్లిపోతున్నారు. దీనిపై డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకట్రావును వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించినప్పటికీ అందుబాటులో లేరు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వసుంధర

పెరవలి, ఫిబ్రవరి 21: మండలంలోని అన్ని గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వసుంధర పేర్కొన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కానూరు అగ్రహారం, వెంకట్రాయపురం, అజ్జరం గ్రామాల్లో వైద్యాధికారుల బృందం పర్యటించి క్షయ బారిన పడి చికిత్స పొందుతున్న వారి వివరాలు తెలుసుకున్నారు. టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు హేమరాజు, విజయకుమార్, ఎంపీపీ కె.ప్రసాద్, సర్పంచ్‌లు పోలిశెట్టి బాలాజీ, సుధా నాగభూషణం, దాసం వెంకన్న పాల్గొన్నారు.

కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి పర్యటన



కొవ్వూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, ఫిబ్రవరి 20: కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజా ఆశీర్వాద కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం పట్టణంలోని 1,2,3,4 వార్డులలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజలితోపాటు ఏలూరి విజయలక్ష్మి, పోసిన శ్రీలేఖ, కవల నాగేశ్వరరావు, నేతల వెంకటేష్ పాల్గొన్నారు.

మార్చి 10న సావిత్రిబాయి పూలే వర్ధంతి సభ

నిడదవోలు, ఫిబ్రవరి 20: సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సభ మార్చి 10న గుంటూరు కొరటాల భవనంలో నిర్వహిస్తున్నామని, దానిని జయప్రదం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అన్నారు. మంగళవారం నిడదవోలులో సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి వర్ధంతి సభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి ఉపాధ్యాయురాలిగా మహిళా విద్యకు సేవలందించిన సావిత్రిబాయి వర్ధంతి సభకు ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మెరిపో జాన్‌రాజ్, మనుకోడ శ్రీను, కోరాడ రామదాసు, శ్రీను, సత్తియ్య, బాబూరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు, ఫిబ్రవరి 20: నిడదవోలులోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గొన్నాబత్తుల రామారావు ఆర్థిక సహకారంతో రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని పేద మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు, పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, పొన్నా సుబ్రహ్మణ్యం ఆరుగొల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు హోం మంత్రి భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి తానేటి వనిత

గోపాలపురం, ఫిబ్రవరి 20: శిథిలమైన గోపాలపురం-సాయిపాలెం రహదారి నిర్మాణ పనులకు హోం మంత్రి తానేటి వనిత మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం భీమోలు గ్రామ శివారులో ఉన్న అక్కదేవతల అమ్మవారిని దర్శించుకుని గోపాలపురం మార్కెట్‌యార్డులో జరిగిన వలంటీర్ల వందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



నిడదవోలు, ఫిబ్రవరి 20: నిడదవోలులోని బసివిరెడ్డిపేటలో అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు సహస్రనామ అర్చనలు, నిత్యోపాసన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. అనంతరం కల్యాణం తంతు ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. బుధవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు వెలగల జయచంద్రారెడ్డి, కేదారిశెట్టి నెహ్రూ, పేరిచర్ల సత్యనారాణరాజు తెలిపారు.

భక్తాంజనేయస్వామి ఉత్సవాలు

పెరవలి, ఫిబ్రవరి 21: నల్లాకుల వారి పాలెంలో భక్తాంజనేయస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు.. చిన్నపిల్లలకు పటికబెల్లంతో తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యానికి బీఎస్పీ కృషి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 20: బహుజనుల రాజ్యం కోసం బీఎస్పీ కృషి చేస్తున్నట్టు పార్టీ నియోజకవర్గ అభ్యర్థి గుమ్మాపు చిత్రసేన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల్లో ఇంటింటా తిరిగి బీఎస్పీ ఆశయాలు, మేనిఫెస్టోను వివరించారు. రానున్న ఎన్నికల్లో తమ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చల్లాబత్తుల సత్యనారాయణ, మద్రి మహాలక్ష్ముడు, తాడేపల్లి సుందరరావు, మేళం చంటి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు

తప్పిన ప్రాణాపాయం.. విద్యుత్ సరఫరాకు అంతరాయం



నల్లజర్ల, ఫిబ్రవరి 20: ఒరిస్సా నుంచి విజయవాడ వెళ్లుతున్న ఓఎస్ ఆర్టీసీ బస్సు మంగళవారం తెల్లవారుజామున నల్లజర్లలో డివైడర్‌ను ఢీకొన్ని టైరు పంక్చరై అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. సుమరు 60 మీటర్ల దూరం వరకు దూసుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు న్నారు. వారిని మరొక బస్సులో విజయవాడకు తరలించారు. ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ స్తంభం విరిగిపోవడం వల్ల నల్లజర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న భక్త దంపతులు

దేవరపల్లి, ఫిబ్రవరి 20: దేవరపల్లి షిరిడి సాయిబాబా వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా రథ సప్తమి నుంచి భీష్మ ఏకాదశి వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఆఖరి రోజు మంగళవారం ఆలయార్చకులు, వేద పండితులు మహావిష్ణుహోమం, సుదర్శన హోమం, శాంతికల్యాణం ఘనంగా జరిపారు. శాంతికల్యాణంలో తీగల లక్ష్మీనారాయణ, గాయిత్రీ దంపతులు సుదర్శనహోమంలో ఉప్పలపాటి శ్రీమన్నారాయణ, ప్రసన్నలక్ష్మీ దంపతులు, నరహరశెట్టి నాగభూషణం, లక్ష్మీ దంపతులు, పుప్పాల చంద్రకాంత్, భూలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

కాల్ధరిలో పీఎంపీల సమావేశం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 20: మండలంలోని కాల్ధరి గ్రామంలో పీఎమ్‌పీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా శాఖ అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. దీనికి అమృత హాస్పిటల్స్ డాక్టర్లు వల్లభనేని కిశోర్, పి.భార్గవ్ సాయిరామ్ విచ్చేసి ప్రస్తుతం ఉన్న వైద్య విధానము, ప్రజల ఆరోగ్య పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ ఆర్ఎమ్ఎస్ మల్లేశ్వరరావు, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన పవన్ కల్యాణ్ పర్యటన

- రాజమహేంద్రవరంలో సమీక్ష తర్వాత మంగళగిరి పయనం
- రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాకే కన్ఫర్మ్ చేశారు: దుర్గేష్
- రాజానగరం అసెంబ్లీ సీటుపై రాని స్పష్టత

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం పర్యటన ముగిసింది. మంగళవారం ఏవీ అప్పారావు రోడ్డులోని గెయిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఇన్‌చార్జులు, నాయకులతో పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పరిస్థితి, గెలుపు ఓటములపై పవన్‌కల్యాణ్ పార్టీ నాయకులతో చర్చించినట్టు సమాచారం. ప్రధానంగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోకవర్గాలపై ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టి వీటిపైనే ఎక్కువగా చర్చించినట్టు సమాచారం. రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే పవన్‌కల్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ఎవరిని పోటీలోకి దింపుతారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. అయితే రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణకు టిక్కెట్ ఖరారు చేస్తారని అంతా భావించినా అలా జరగలేదు. నియోజకవర్గంలో పరిస్థితిని మాత్రమే పవన్‌కల్యాణ్ చర్చించినట్టు తెలిసింది. ఇదే విషయాన్ని రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బత్తుల బలరామకృష్ణ కూడా స్పష్టంచేశారు. అయితే రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో టిక్కెట్ తనకే దక్కుతుందని భావిస్తున్నానని బలరామకృష్ణ చెబుతున్నారు. మరోపక్క రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీ ఖాయంగా కనిపిస్తోంది. నియోజకవర్గ పరిస్థితిపై పవన్‌కల్యాణ్‌తో సమావేశం తర్వాత కందుల దుర్గేష్ మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ టిక్కెట్ తనకు కన్‌ఫర్మ్ చేశారని స్పష్టం చేయడం గమనార్హం. ఇదిలాఉంటే, రాజమహేంద్రవరం వచ్చిన పవన్‌కల్యాణ్‌ను రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ నాయకులు హరీష్‌మాధుర్ తదితరులు కలిశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ సుమారు గంటసేపు పవన్‌కల్యాణ్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన జనసేన పార్టీ నాయకులు కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చారు. కాగా సోమవారం రాత్రి షెల్టన్ హోటల్‌లో బస చేసిన పవన్ కల్యాణ్ మంగళవారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఏవీ అప్పారావు రోడ్డులోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాలకు సంబంధించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశమైన అనంతరం సాయంత్రం 4.30 గంటల సమయంలో పవన్‌కల్యాణ్ బయలుదేరి వెళ్లారు. పవన్‌కల్యాణ్ రాకతో జనసేన పార్టీ కార్యాలయం వద్దకు ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పవర్‌స్టార్ సీఎం అంటూ నినాదాలు చేశారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్



పార్టీ నాయకులతో సమావేశంలో జనసేనాని పవన్‌కల్యాణ్

సమర్థులైన నాయకుల కోసం ప్రార్థించండి

- పాస్టర్స్ ఆత్మీయ సమావేశంలో మద్దిపాటి వెంకట్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఫిబ్రవరి 20: పేదల సంక్షేమం, సుస్థిర పాలనకు సమర్థులైన నాయకులను ఎన్నుకోనేందుకు దైవసేవకులు ప్రార్థించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు కోరారు. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్ నివాసం వద్ద మండలంలో సేవ చేస్తున్న దైవ సేవకుల ఆత్మీయ సమావేశం ఎంపీపీ రొంగలి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. మండల పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు, దైవజనులు, సుదీర్ఘకాల సేవా జీవితంలో తాము ఎదుర్కుంటున్న ఇబ్బందులను తమ అభిప్రాయాలను మద్దిపాటి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు, అధికారులు సమర్థులైనప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి బాటలు వేసిన పార్టీ అని అన్నారు. ప్రస్తుతం ఆదే పార్టీలో గోపాలపురం ఇన్‌చార్జిగా నియమితమై ఆశీర్వాదం కోసం అభ్యర్థిస్తున్నానని మద్దిపాటి అన్నారు. అనంతరం దైవ సేవకులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో గోపాలపురం పాస్టర్స్ ఫెలోషిప్ దైవసేవకులు శామ్యూల్‌రాజు, తానేటి రాజు, ఏసురాజు, గెల్లా ఎలీషా, పలివెల జెకర్యాతో పాటు టీడీపీ నాయకులు నూతంగి దొరబాబు, రమేష్, రాము, గద్దే హరిబాబు, మంగారావు, జొన్నలగడ్డ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు
- జేఏసీ పోరాటానికి మద్దతుగా ఉపాధ్యాయుల నిరసన

తాళ్లపూడి, ఫిబ్రవరి 20: ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు దున్నా దుర్గారావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ జేఏసీ పోరాటానికి మద్దతుగా మండలంలోని మలకపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రైమరీ, సబ్జెక్ట్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన దుర్గారావు మాట్లాడుతూ దొడ్డిదారిన ప్రవేశపెట్టిన అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, 12వ పీఆర్సీ ఇప్పటికే ఆలస్యమైనందున మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీవో 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బతికించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యదర్శి ఎం.మనోజ్ మాట్లాడుతూ ఈ నెల 27న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని, పోలీసుల నోటీసులు, పహారాలతో ఉద్యమాన్ని అడ్డుకుంటే ఉపాధ్యాయ ఉద్యోగులే రానున్న కాలంలో ఓటు ద్వారా ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో రఘువీర్ శాస్త్రి, రమణ, పాపారావు, చిట్టిరాజు, జయబాబు, నాగజ్యోతి, శేషబాయమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.



మలకపల్లి హైస్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జనార్దనుని రథోత్సవం



ధవళేశ్వరంలో జనార్దనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 20: వేలాదిగా తరలివచ్చిన భక్త జన సందోహం మధ్య జనార్దన స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. సర్వ అలంకార భూషితుడైన జనార్దనుడు ఉభయదేవేరులతో రథంపై ఆశీనులు కాగా వందలాది మంది భక్తులు జయజయ జనార్దన అంటూ రథానికి ఉన్న తాడు లాగుతుండగా రథంపై నుంచి స్వామి వారు భక్తులను అనుగ్రహిస్తూ ముందుకు సాగారు. మంగళవారం మధ్యాహ్నం కొండపై నుంచి స్వామి, అమ్మవార్లను పల్లకిపై ఆశీనులు గావించి భాజా భజంత్రీల నడుమ కొండ దిగువునకు తీసుకువచ్చి రథంపై ఆశీనులు చేశారు. అనంతరం రథం ముందు కుంభంపోసి నైవేద్యంగా సమర్పించారు. మంత్రి వేణుగోపాలకృష్ణ పూజలు చేసి రథోత్సవం ప్రారంభించారు. సన్నాయి వాయిద్యాలు, బుట్ట బొమ్మలు కదులుతుండగా భక్తజనం మధ్య రథోత్సవం ప్రారంభమై పోలీస్‌స్టేషన్ వరకు సాగి వెనుదిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. అనంతరం రాత్రికి కొండపై ఉన్న కల్యాణ వేదికపై స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు తెల్లవారుజామున స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి అలంకరించారు. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులుబారులు తీరారు. స్వామివారిని మంత్రి వేణుగోపాలకృష్ణ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు దర్శించి పూజలు నిర్వహించారు. వివిధ సంస్థల, సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదం వితరణ చేశారు. దక్షిణ మండలి డీఎస్పీ అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్, పలువురు ఎస్‌ఐలు 100 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

సామాజిక న్యాయానికి ప్రాధాన్యమివ్వాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు మరింత సమన్వయంతో పని చేస్తాయని జిల్లా న్యాయా సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖతో కలిసి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ థీమ్‌గా 'అంతరాలను తగ్గించడం, పొత్తులను నిర్మించడం' నిర్ణయించారన్నారు. సమానత్వ హక్కు చట్టం, మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలు, ప్రభుత్వాలకు వారధిలా పనిచేస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ చేరువ చేయడమే డీఎల్ఎస్ఏ ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఎం.సందీప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో మోసం

హోం మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న యూత్ కాంగ్రెస్



మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న యువజన కాంగ్రెస్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కాన్వాయ్‌ను రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు నేతృత్వంలో 20 మంది సభ్యులు అడ్డుకున్నారు. మంగళవారం రాత్రి ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం వచ్చిన హోం మంత్రి వనిత కాన్వాయ్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు అడ్డగించి ముట్టడించారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాత్రి 10:40 గంటలకు వారిని వ్యక్తిగత పూచికతులపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల మంది నిరుద్యోగులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. వెంటనే 30వేల డీఎస్సీ పోస్టులను విడుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్రంలోని నిరుద్యోగులందరితో కలిసి మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబి, బీఆర్ గౌస్, తోడేటి సందీప్ ఐశ్వర్, సుశీల్‌కుమార్, రామ్ సూరిరెడ్డి, శేషగిరి, బట్టు శ్రీకాంత్, రామ్‌సింగ్, అంకెం సీతారామ్, కైపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి పూజలు

కొవ్వూరు, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి సందర్భంగా విష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుని ఆలయంలో స్వామివారిని తులసిమాలతో అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. సంస్కృత పాఠశాల శివాలయంలో గోష్పాదేశ్వరస్వామికి గోక్షీరాభిషేకం చేశారు. అలాగే పట్టణ, మండలంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలతోపాటు విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.

పెరవలి: మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకరపర్రు, తీపర్రు లక్ష్మీనరసింహస్వామి, అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

దేవరపల్లి: మండలంలోని ప్రధాన ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి భజనా సంకీర్తనలు నిర్వహించారు. దేవరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం, గరుడసేవ, పల్లపువీధి రామాలయం, గీతామందిరంలో భజనా సంకీర్తనలు ఆలపించారు.

గోపాలపురం: భీమోలు గ్రామ శివారులో శ్రీఅక్కదేవతల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం తిలకించారు. జనసేన-టీడీపీ అధికారంలోకి రాగానే అక్కదేవతల ఆలయం నుంచి గ్రామం వరకు శాశ్వత రోడ్డు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు గ్రేడింగ్‌లో అన్యపదార్థాలు ఉండకూడదు

పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య

గోపాలపురం, ఫిబ్రవరి 20: పొగాకు గ్రేడింగ్‌లో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య రైతులకు సూచించారు. మండలంలోని వేళ్లచింతలగూడెం, ఆదర్శక్షేత్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు పంటలో పిలకల నివారణ, తల తుంచుట, ఆకురేల్పు, క్యూరింగ్, గ్రేడింగ్ తదితర దశల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా తల తుంచిన తర్వాత రసాయనిక ఎరువులు వాడరాదన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రేలాలన్నారు. కార్యక్రమంలో అక్షన్ సూపరింటెండెంట్ శ్యామ్, ఎస్ఈవో హేమస్మిత, రవి, సీతారామరాజు, రైతులు ఇల్లూరి రాంబాబు, పరిమి జగదీష్, ఈగల హరిబాబు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 20: కొవ్వూరు రోడ్ కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకి గల్లంతయిన యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. రోడ్డు కం రైలు బ్రిడ్జి 133వ స్తంభం వద్ద ఈ నెల 19న బైక్, చెప్పులు విడిచిపెట్టి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహాన్ని ఔరంగాబాద్ ఇసుకర్యాంపు సమీపంలో మంగళవారం గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు కొవ్వూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన నార్కెడిమిల్లి ప్రవీణ్(29)గా గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ప్రతి క్షణం ప్రజల రక్షణకే పోలీస్: ఎస్పీ జగదీశ్

కానిస్టేబుల్ శ్రీనివాస్‌కి సత్కారం



కానిస్టేబుల్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగమంటే కృతజ్ఞతలను సైతం కోరుకోకుండా ప్రతిక్షణం ప్రజల రక్షణకే పాటుపడే గొప్ప అవకాశమని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. విధుల కంటే సామాజిక స్పృహ ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటుందన్నారు. సమయస్ఫూర్తితో ఏడుగురి ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచిన సాయుధ రిజర్వు విభాగం కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు(ఏఆర్‌పీసీ-603)ను ఆయన సత్కరించారు. ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. సోమవారం కోనసీమ జిల్లాలోని బెల్లంపూడి సెంటర్ వద్ద కారు అదుపు తప్పి బైక్‌ని ఢీకొట్టి కాల్వలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. తక్షణమే స్పందించి కాల్వలోకి దూకి పీకలలోతు నీటిలోంచి ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడినందుకు శ్రీనివాసరావును ఎస్పీ ప్రశంసించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనీల్‌కుమార్, అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.వెంచిరెడ్డి, రిజర్వు ఇన్స్‌పెక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి ప్రాధాన్యమివ్వాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు మరింత సమన్వయంతో పని చేస్తాయని జిల్లా న్యాయా సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖతో కలిసి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ థీమ్‌గా 'అంతరాలను తగ్గించడం, పొత్తులను నిర్మించడం' నిర్ణయించారన్నారు. నిరుద్యోగం, పేదరికం, లింగ వివక్ష, మానవ హక్కులు, సామాజిక రక్షణలోని సమస్యలను పరిష్కరించడం ద్వారా సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడంలోని ప్రాముఖ్యతను ఈ దినోత్సవం తెలియజేస్తుందన్నారు. సమానత్వ హక్కు చట్టం, మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలు, ప్రభుత్వాలకు వారధిలా పనిచేస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ చేరువ చేయడమే డీఎల్ఎస్ఏ ముఖ్యోద్దేశమన్నారు. ఈ విషయంలో ఇబ్బందులు ఎదురైతే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఎం.సందీప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా పోరు యాత్రలు

రాజానగరం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలన అంతమొందించాలనే నినాదంతో రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ఈ నెల 21నుంచి నియోజకవర్గంలో ప్రజాపోరు యాత్ర ప్రారంభిస్తున్నట్టు రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, కోకన్వీనర్ గణపతిరావు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాజానగరం మండలంలోని సీతారాంపురంలో బుధవారం ఉదయం 8.30గంటలకు ప్రజాపోరు యాత్ర ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి, ప్రజావ్యతిరేక పాలనపై నిలదీయనున్నట్టు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలన్నారు.

యాత్రల షెడ్యూల్.. 21న సీతారాంపురం, కలవచర్ల, నరేంద్రపురం, రాజానగరం; 22న దివాన్‌చెరువు, ఫరిజెల్లిపేట, కానవరం, పల్లకడియం; 23న తోకాడ, కొత్తతుంగపాడు, శ్రీకృష్ణపట్నం, శ్రీరాంపురం; 24న పుణ్యక్షేత్రం, కొండగుంటూరు, సంపత్‌నగరం, లాలాచెరువు; 25న కోరుకొండ మండలంలోని పశ్చిమగోన గూడెం, నరసాపురం, కనుపూరు, గాదరాడ; 26న గాడాల, మధురపూడి, బూరుగుపూడి, బుచ్చంపేట; 27న దోసకాయలపల్లి, మునగాల, కాపవరం, కోరుకొండ; 28న బొల్లెద్దుపాలెం, రాఘవపురం, కోడికేశవరం, శ్రీరంగపట్నం; 29న బొబ్బిలంక, జాలిమూడి, కాటవరం, ఇనగంటివారిపేట, మార్చి 1న సీతానగరం, ముగ్గుళ్ల, కూనవరం గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్రలు నిర్వహించనున్నట్టు వీరన్నచౌదరి తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	: ఈగల్
వై.స్క్రీన్ 2	: రాజధాని ఫైల్స్
దేవిశ్రీ(గాయత్రి)	: హనుమాన్
అనన్య	: ఊరి పేరు భైరవ కోన

నిడదవోలు

వీ మ్యాక్స్	: ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	: రాజధాని ఫైల్స్
శ్రీగణపతి	: ఈగల్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	: గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	: సలార్
శ్రీనివాస	: సలార్